
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5 నంద్యాల

జిల్లా వార్తలు

సోమవారం 15 ఏప్రిల్ 2024





భూమా అఖిలప్రియతో కలిసి చంద్రబాబును కలిసిన రాజ పృథ్వీకుమార్‌రెడ్డి



- అధికార పార్టీని వీడుతున్న కీలక నేతలు
- టీడీపీలోకి భారీగా చేరికలు
- ముఖ్య నాయకుల వలసలతో వైసీపీ బేజారు
- దిక్కుతోచని స్థితిలో అధికార పార్టీ
- ఎన్నికల వేళ వైసీపీకి ఎదురుదెబ్బలు

వైసీపీలో ప్రకంపనలు

ఎన్నికల వేళ అధికార వైసీపీలో అలజడి మొదలైంది. నియోజకవర్గాల్లో కీలకంగా వ్యవహరిస్తున్న నాయకులు ఒక్కొక్కరిగా పార్టీ వీడుతున్నారు. ప్రజల్లో టీడీపీకి వస్తున్న ఆదరణ.. జగన్ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఉన్న నేపథ్యంలో వైసీపీ నాయకులు జగన్‌కు బైబై చెబుతున్నారు. జగన్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉండటం, మళ్లీ గెలిచే పరిస్థితి లేకపోవడంతో కొందరు పార్టీని వీడుతుంటే.. జగన్ పార్టీలో సరైన గౌరవం దక్కకపోవడంతో నేతలు వైసీపీకి రాజీనామా చేస్తున్నారు. ద్వితీయ శ్రేణి వలసలు, మరో వైపు రోజు రోజుకూ ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వెరసి ఓటమి తప్పదన్న సంకేతాల నేపథ్యంలో అధికార వైసీపీ కేడర్‌లో కలకలం చెలరేగుతోంది. కీలక నాయకులు గుడ్ బై చెప్పడంతో అధికార పార్టీ అభ్యర్థుల్లో కొత్త టెన్షన్ మొదలైంది.

నంద్యాల, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో టీడీపీ గాలి జోరుగా వీస్తోంది. వచ్చే ఎన్నికల్లో టీడీపీ జెండా ఎగురడం ఖాయంగా కనిపిస్తోంది. ఈ విషయం పసిగట్టిన వైసీపీ దిగువశ్రేణి నాయకులు ఆ పార్టీని వీడుతున్నారు. ఆయా నియోజకవర్గాల్లో ప్రతి పక్ష నాయకులు సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకుంటున్నారు. దీంతో వైసీపీ నాయకుల వెన్నులో వణుకు మొదలైంది. ఈ వలసలతో నాయకులకు తలనొప్పి తీసుకువస్తుండటంతో పాటు, పార్టీ కేడర్ మనోస్థైర్యం కూడా దెబ్బతింటోంది. ఈ పరిస్థితి ఇలానే కొనసాగితే రానున్న సార్వత్రిక ఎన్నికల్లో తమ ఓటమి తప్పదన్న విషయం వైసీపీ అభ్యర్థులకు తెలిసిపోయింది. దీంతో వలసలను ఆపేందుకు ఆయా నియోజకవర్గ నాయకులు నానా తిప్పలు పడుతున్నారు. సర్వేలన్నీ తప్పులు చెబుతున్నాయని, మళ్లీ వచ్చేది మన ప్రభుత్వమేనని ఎంత చెప్పినా వైసీపీ దిగువ శ్రేణి నాయకులు వినే పరిస్థితి లేదు. దీంతో కేడర్ ఉన్న నాయకులు జారిపోకుండా ఉండేందుకు వారికి రేటు ఇంత అని రేటు ఫిక్స్ చేసి డబ్బులు ముట్టజెబుతున్నారు. ఇంత చేస్తున్నా ఎక్కడా కూడా టీడీపీలోకి చేరికలు ఆగడం లేదు.

బీసీ వ్యూహంతో వైసీపీ కుదేలు

బనగానపల్లె నియోజకవర్గం వైసీపీ పాలనలో పూర్తిగా వెనుకబడిపోయింది. గత టీడీపీ హయాంలో అప్పటి ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు పూర్తిగా అవసాన దశకు చేరుకున్నాయి. ఈసారి ఎన్నికల్లో గెలిచి నియోజకవర్గాన్ని మళ్లీ అభివృద్ధి పథంలో నడపాలన్న ఉద్దేశంతో బీసీ దూసుకుపోతున్నారు. ఇదే క్రమంలో తనదైన చాణక్యాన్ని ప్రదర్శిస్తూ ప్రత్యర్థి పార్టీని ఆయన ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారు. ఎమ్మెల్యే రామిరెడ్డి తీరుతో విసిగిపోయిన వైసీపీలో ఉన్న అసంతృప్త నేతలు, నియోజకవర్గ అభివృద్ధిని కాంక్షించే వైసీపీ నాయకులను తన వైపునకు తిప్పుకుంటున్నారు. బీసీ యోచన ఫలించడంతో వైసీపీ ముఖ్య నాయకులు టీడీపీ కండువాలు కప్పుకున్నారు. ఇలా చేరిన వారిలో ఏకంగా కాటసాని రామిరెడ్డి సొంత బంధువు కాటసాని చంద్రశేఖరరెడ్డి (పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి సోదరుడు), ఆయన బావమరిది వంగల పరమేశ్వరరెడ్డి ఉన్నారు. ఇక అవుకు మండలంలో చల్లా రామకృష్ణారెడ్డి సొంత సోదరుడు చల్లా విజయభాస్కరరెడ్డి కూడా బీసీ సమక్షంలో టీడీపీలో చేరారు. వీరితోపాటు కొలిమిగుండ్ల, అకుమల్ల సర్పంచులు కూడా వైసీపీ వీడి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఇక ముఖ్య నాయకులతో పాటు బనగానపల్లె నియోజకవర్గ వ్యాప్తంగా రోజూ వందల సంఖ్యలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు వైసీపీని వీడి బీసీ సమక్షంలో టీడీపీ కండువాలు కప్పుకుంటున్నారు. ఈ స్థాయిలో ఇక్కడ వైసీపీ ఖాళీ అవుతుండటంతో ఆ పార్టీ నాయకులు ఏం చేయాలో పాలుపోవడం లేదు.



చంద్రబాబు నాయుడు, బీసీ జనార్దన్‌రెడ్డి సమక్షంలో టీడీపీ కండువా కప్పుకుంటున్న చల్లా విజయభాస్కరరెడ్డి

ఆళ్లగడ్డలో గంగుల వర్గం ఖాళీ!

అన్ని చోట్ల పార్టీల పరంగా లెక్కలు ఉంటే.. ఆళ్లగడ్డలో మాత్రం వర్గ రాజకీయం నడుస్తుంది. ఇక్కడ టీడీపీ నుంచి భూమా వర్గం ఉండగా, వైసీపీ నుంచి గంగుల వర్గం ఏళ్లుగా రాజకీయ హవా కొనసాగుతోంది. ఈ సారి కూడా ఈ రెండు కుటుంబాల మధ్యే పోరు నడుస్తోంది. ఎన్నికలు సమీపించగానే భూమా అఖిలప్రియ గంగుల వర్గాన్ని ఖాళీ చేసే దిశగా రాజకీయాన్ని సాగించింది. ఆమె మంత్రాంగం ఫలించి ప్రస్తుత ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రనాథ్‌రెడ్డి వర్గం మొత్తం టీడీపీలో చేరుతోంది. ఇప్పటికే మాజీ కాటన్ బోర్డు చైర్మన్ చింతకుంట శ్రీనివాసరెడ్డి (వాసు), పడకండ్ల రెండో వార్డు కౌన్సిలర్ బద్రీ సుధామణి, ఆమె భర్త సుధాకర్‌రెడ్డి భూమా అఖిలప్రియ సమక్షంలో టీడీపీ కండువా కప్పుకున్నారు. గంగుల బ్రిజేంద్రనాథ్‌రెడ్డి సొంత బాబాయి కొడుకులు రాజ పృథ్వీరెడ్డి, ప్రహ్లాద్‌రెడ్డి కూడా టీడీపీలో చేరిపోయారు. వీరంతా గంగుల కుటుంబానికి అత్యంత సన్నిహితులు. ఇక భూమా కిశోర్‌రెడ్డిని వైసీపీలోనికి చేర్చుకుని భూమా అఖిలప్రియపై పైచేయి సాధించానని భావించిన బ్రిజేంద్రనాథ్‌రెడ్డి ఆనందం రెండు రోజులు కూడా నిలువలేదు. భూమా కిశోర్‌రెడ్డి వర్గం భారీగా అఖిలప్రియ సమక్షంలో టీడీపీలో చేరారు. శిరివెళ్ల, రుద్రవరం, చాగలమర్రి నుంచి కూడా వైసీపీ నుంచి టీడీపీలోనికి చేరికలు జరుగుతూనే ఉన్నాయి.

డోన్‌లో బుగ్గనకు గడ్డుకాలం

మొన్నటి వరకు డోన్ నియోజకవర్గంలో ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి తిరుగులేని ఆదిపత్యం చెలాయించారు. ఐదేళ్ల పాటు పార్టీలో ఎవరూ నోరు మెదపని విధంగా హవా నడిపించారు. వైసీపీలో ప్రాధాన్యం లేదని ఓ కౌన్సిలర్ టీడీపీలో చేరితే.. పోలీసుల బలంతో తిరిగి వైసీపీ కండువా కప్పుకునేలా మంత్రి బుగ్గన సాగించారు. కానీ ప్రస్తుతం వైసీపీలో అంతా సీన్ రివర్స్ అయింది. మంత్రి బుగ్గనపై సొంత పార్టీ నేతలే తిరుగుబాటు చేస్తున్నారు. డోన్ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డిని ప్రకటించాక ఈ తిరుగుబాటు మరింత ఎక్కువైంది. కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి, ఆయన సతీమణి మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ నియోజకవర్గంలో పకడ్బందీగా పావులు కదుపుతున్నారు. మంత్రి బుగ్గన ముఖ్య అనుచరుడు, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ సొంత బంధువులు కోట్ల దంపతులు, తనయుని సమక్షంలో టీడీపీలో చేరారు. వీరితో పాటు నియోజకవర్గంలోని కొందరు సర్పంచులు, డోన్ మున్సిపల్ కౌన్సిలర్లు టీడీపీలో చేరుతుండడం వైసీపీని కలవరపెడుతోంది.



కోట్ల సమక్షంలో టీడీపీలో చేరిన మున్సిపల్ చైర్మన్ బంధువులు

మూడు నెలల ముందు నుంచే..

అన్ని చోట్ల అధికార పార్టీ పరిస్థితి ఒకలా ఉంటే.. శ్రీశైలంలో మాత్రం మరోలా ఉంది. ఇక్కడ వైసీపీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డికి వచ్చే ఎన్నికల్లో పరాజయం తప్పదన్న అభిప్రాయం సంవత్సరం కిందటి నుంచే వినిపించడం మొదలైంది. కిందటేడాది టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను అటవీ మార్గం గుండా నడిపింపజేసి యువగళం పాదయాత్రను బుడ్డా రాజశేఖర్‌రెడ్డి సక్సెస్ చేశారు. ఇక అప్పటి నుంచి నియోజకవర్గంలో టీడీపీ గ్రాఫ్ పెరుగుతూ వచ్చింది. ఒకప్పుడు కాంగ్రెస్‌కు, ఆ తర్వాత వైసీపీకి కంచుకోటగా ఉన్న గ్రామాలు పూర్తిగా బుడ్డా రాజశేఖరరెడ్డి సమక్షంలో టీడీపీలోకి చేరాయి. సిద్ధాపురం సర్పంచ్ వెంకటరమణ, శ్రీశైలం నియోజకవర్గం వైసీపీ వాణిజ్య విభాగం అధ్యక్షుడు కొప్పరపు రవిప్రసాద్, వైసీపీ జిల్లా కార్యదర్శి తిమోతి, ఆత్మకూరు మండల వైసీపీ యూత్ అధ్యక్షుడు దినకర్ వంటి ముఖ్య నాయకులు టీడీపీ కండువాలు కప్పుకున్నారు. దీంతో సిద్ధాపురం, కరివేన, కురుకుంద గ్రామాలు పూర్తిగా టీడీపీ వైపు మళ్లినట్లయింది. ఇక ఆత్మకూరు టౌన్‌లోని కొంతమంది కౌన్సిలర్లు టీడీపీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. ఆత్మకూరులో 5 దశాబ్దాల సుదీర్ఘ రాజకీయ చరిత్ర కలిగిన ఆత్మకూరు మేజర్ గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ మోమీన్ హుసేన్ సాహెబ్ మనవడు మోమీన్ ఇబ్రహీం కలీలుల్లా తన బంధువర్గంతో కలిసి దాదాపు 35 ఏళ్ల తర్వాత బుడ్డా కుటుంబానికి చేరువయ్యారు. బుడ్డాతో కలిసి కలీలుల్లా పనిచేస్తున్నాడన్న విషయం నియోజకవర్గంలో వైసీపీకి పెద్ద షాక్ కాగా, మైనారిటీల్లో టీడీపీకి బలం చేకూరినట్లయింది. టీడీపీలో చేరికలను అడ్డుకునేందుకు ఆపేందుకు శిల్పా చక్రపాణిరెడ్డి చేస్తున్న ప్రయత్నాలు విఫలమవుతున్నాయి.



చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరిన కాటసాని చంద్రశేఖరరెడ్డి



బుడ్డాతో కలిసిన కలీలుల్లా కుటుంబం

ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు: ఎస్పీ



నంద్యాల క్రైం, ఏప్రిల్ 14: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ప్రశాంత, స్వేచ్ఛాయుత పోలింగే ధ్యేయంగా పోలీస్ శాఖ పని చేస్తుందన్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో నిత్యం ఏదో ఒక సమస్యాత్మక ప్రాంతం, గ్రామంలో కేంద్ర సాయుధ బలగాలతో కవాతు నిర్వహిస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా సరిహద్దు చెక్‌పోస్టలలోని సిబ్బందిని అప్రమత్తం చేస్తూ ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఆదేశించామని చెప్పారు. మద్యం, నగదు, బంగారం, విలువైన వస్తువులు అక్రమంగా తరలివెళ్లకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకున్నట్లు వివరించారు. అలాగే జిల్లాలోని పోలీస్ అధికారులు, సిబ్బందిని గ్రామాలకు పంపి స్థానికులతో అవగాహన సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. జిల్లాలో ఇంతవరకు కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలను, ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించిన వారిపై 41 కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. అలాగే జిల్లాలోని రెండు అంతర్రాష్ట్ర, 8 అంతర్‌జిల్లా చెక్‌పోస్టలలో నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తున్న రూ.3,28,00,000 స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఇప్పటివరకు ముందస్తు చర్యల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా గతంలో కేసుల్లో ఉన్నవారిని, ఎన్నికల్లో గొడవలు చేస్తారని, మద్యం పంపిణీ చేసేవారిని, శాంతిభద్రతలకు భంగం కలిగించే 2,489 మందిని కేంద్ర ఎన్నికల నిబంధనల ప్రకారం బైండోవర్ చేశామని తెలిపారు. ఎన్నికల కోడ్ అమల్లోకొచ్చినప్పటి నుంచి నేటి వరకు జిల్లాలో నాటుసారా తయారీ, రవాణా, విక్రయదారులపై 142 కేసులు నమోదు చేసి 6364 లీటర్ల సారా సీజ్ చేశామని చెప్పారు. అలాగే అక్రమంగా గంజాయి, మద్యం తరలిస్తున్న, విక్రయిస్తున్న వారిపై 25 కేసులు నమోదు చేసి 1108.87 లీటర్లు సీజ్ చేసినట్లు తెలిపారు. 257 డీపీఎల్ కేసులు నమోదు చేశామని, గంజాయికి సంబంధించి 3 కేసులు నమోదు చేసి 2.35 గ్రాముల గంజాయిని సీజ్ చేశామని తెలిపారు. జిల్లాలో ఎవరైనా ఎన్నికల సంఘం నిబంధనలను ఉల్లంఘిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు.



టీడీపీలో చేరిన బలిజ సంఘం నాయకులు

ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి, నంద్యాల అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి ఫరూక్, టీడీపీ ఎంపీ అభ్యర్థి బైరెడ్డి శబరి, రాష్ట్ర కార్యదర్శి తులసి రెడ్డి బలిజ సంఘం నాయకులకు కండువా కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ వల్ల

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి: టీడీపీ

నంద్యాల (నూనెపల్లె), ఏప్రిల్ 14: చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమం సాధ్యమని టీడీపీ నేతలు అన్నారు. బలిజ సంఘం మాజీ పట్టణ అధ్యక్షుడు ఏవీ రంగయ్య కుటుంబంతో పాటు, వర్దంశెట్టి రాజారం, పలువురు బలిజ సంఘీయ నాయకులతో పాటు 300 కుటుంబాలు ఆదివారం టీడీపీలో చేరాయి. మాజీ టీడీపీ సీనియర్ నాయకుడు మాజీ రాష్ట్రం తీవ్రంగా నష్టపోయిందని అన్నారు. శిల్పా కుటుంబం బలిజలకు ప్రాధాన్యం ఇవ్వలేదని, దీంతో వారు టీడీపీ చేరుతున్నారని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ కేంద్ర సమితి నాయకులు డాక్టర్ ఇంటి ఆదినారాయణ, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాలను కొనసాగిద్దాం: కలెక్టర్



అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలల వేస్తున్న కలెక్టర్ కె.శ్రీనివాసులు

నంద్యాల (కల్చరల్), ఏప్రిల్ 14: డా.బీఆర్ అంబేడ్కర్ మహనీయుడని, ఆయన ఆశయాలను కొనసాగిద్దామని కలెక్టర్ డా.కె.శ్రీనివాసులు పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఆదివారం అంబేడ్కర్ 133వ జయంతి వేడుకలు నిర్వహించారు. కలెక్టర్‌తో పాటు డీఆర్వో పద్మజ, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి చింతామణి తదితరులు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ అంబేడ్కర్ భారత రాజ్యాంగాన్ని రూపొందించారని కొనియాడారు. దేశంలో ఓటు హక్కును కల్పించిన ఘనత అంబేడ్కర్‌కు దక్కుతుందని, ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకొని ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని కోరారు.

టార్గెట్‌కు మించి సెస్సు వసూళ్లు

- లక్ష్యం రూ.30.85 కోట్లు
- వసూళ్లు 32.75 కోట్లు

కర్నూలు(అగ్రికల్చర్), ఏప్రిల్ 14: ఓ వైపు తీవ్ర వర్షాభావ పరిస్థితులు.. ఇంకో వైపు తెగుళ్ల ఉధృతితో పంట ఉత్పత్తుల దిగుబడి పూర్తిగా తగ్గినా ఉమ్మడి కర్నూలు జిల్లాలో మార్కెటింగ్ శాఖ ఆయా మార్కెట్ కమిటీల నుంచి పకడ్బందీ కార్యాచరణతో సెస్సును వసూళ్లు చేయగలిగింది. ఇప్పటి దాకా సెస్సు చెల్లించకుండా జేబులు నింపుకున్న వ్యాపారులకు మార్కెటింగ్ శాఖ అక్రమాలకు ముకుతాడు వేయగలిగింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఏడు మార్కెట్ కమిటీల నుంచి రూ.3085 కోట్ల సెస్సును వ్యాపారుల నుంచి వసూలు చేయాలని మార్కెటింగ్ శాఖ కమిషనర్ లక్ష్యాన్ని నిర్దేశించగా.. ఆయా మార్కెట్ కమిటీల నుంచి మార్చి నెలాఖరుకు రూ.32.75 కోట్ల సెస్సును వసూలు చేశామని మార్కెటింగ్ శాఖ ఏడీఎం నారాయణమూర్తి తెలిపారు. కర్నూలు మార్కెట్ కమిటీ నుంచి రూ.6.15 కోట్లు వసూలు చేయాలని లక్ష్యాన్ని నిర్దేశించగా రూ.7.57 కోట్ల సెస్సును వసూలు చేయగలిగారు. ఈసారి మహా చెక్ అమలుతో వ్యాపారుల అక్రమాలకు ముకుతాడు వేశామని, అందువల్లనే పూర్తి స్థాయిలో వసూళ్లు రాబట్టగలిగారు. ఆదోని మార్కెట్ కమిటీ నుంచి రూ.16.10 కోట్లు వసూలు చేయాలని లక్ష్యంగా నిర్ణయించగా రూ.14.16 కోట్ల సెస్సును రాబట్టారు. దాదాపు రూ.2 కోట్ల సెస్సు తక్కువగా వచ్చిందని, పత్తి దిగుబడి భారీగా తగ్గడం వల్లే ఈ లోటు వచ్చినట్టు తెలుస్తోంది.



కర్నూలు మార్కెట్ కమిటీ కార్యాలయం

అదేవిధంగా ఎమ్మిగనూరు మార్కెట్ కమిటీ నుంచి రూ.4.50 కోట్లు లక్ష్యం కాగా.. రూ.6.10 కోట్లు రాబట్టగలిగామని తెలిపారు. ఆలూరు నుంచి రూ.1.05 కోట్ల సెస్సు వసూలుకు రూ.1.20 కోట్లు వసూలు చేశారు. పత్తికొండ మార్కెట్ కమిటీ నుంచి రూ.75 లక్షలు సెస్సు వసూలు చేయాల్సి ఉండగా రూ.75.92 లక్షలు వసూలు చేశారు. కోడుమూరు మార్కెట్ కమిటీ నుంచి రూ.1.50 కోట్లు రాబట్టాల్సి ఉండగా రూ.1.47 కోట్లు వసూలు చేశామని, అదేవిధంగా మంత్రాలయం నుంచి రూ.80 లక్షలు వసూలు చేయాల్సి ఉండగా.. రూ.1.46 కోట్లు వసూలు చేశామని ఏడీఎం తెలిపారు. కర్నూలు జిల్లాలోని ఏడు మార్కెట్ కమిటీలలో ఒక్క ఆదోని మార్కెట్ కమిటీ తప్ప.. అన్ని మార్కెట్ కమిటీల నుంచి లక్ష్యాన్ని మించి సెస్సు వసూలు చేశామని, ఇందుకు కారణం ఆయా మార్కెట్ కమిటీల సెక్రటరీలు, సూపర్‌వైజర్లు, సిబ్బంది పూర్తి స్థాయిలో పని చేయడం వల్లే సెస్సు వసూళ్లు బాగా చేయగలిగామని ఆయన స్పష్టం చేశారు. నంద్యాల జిల్లాలో రూ.25.50 కోట్లు సెస్సును రాబట్టాలని లక్ష్యం కాగా, రూ.22.11 కోట్లు వసూలు చేశామని, ఆ జిల్లా మార్కెటింగ్ శాఖ ఏడీఎం రహిమాన్ తెలిపారు. వర్షాభావ పరిస్థితులు, తెగుళ్ల కారణంగానే దిగుబడులు తగ్గాయని, అందువల్లనే సెస్సు వసూళ్లు రూ.3కోట్ల దాకా తక్కువగా వచ్చిందన్నారు.

నేడు, రేపు బాలకృష్ణ పర్యటన



కర్నూలు(అర్బన్), ఏప్రిల్ 14: తెలుగు దేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఈనెల 15, 16 తేదీల్లో జిల్లాలో పర్యటించనున్నారని జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బీటీ నాయుడు తెలిపారు. ఆదివారం జిల్లా టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేయనున్న తెలుగు దేశం, జనసేన, బీజేపీ అభ్యర్థులు విజయాన్ని ఆకాంక్షిస్తూ కర్నూలు, ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గాల్లో ప్రచారం చేస్తారని చెప్పారు. 15న కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని కిమ్స్ హాస్పిటల్ ఆటో స్టాండ్ (జోహరాపురం)నుంచి ర్యాలీ ప్రారంభమవుతుందని, అక్కడి నుంచి జమ్మిచెట్టు, పూలబజారు, వన్‌టౌన్, పెద్దమార్కెట్ మీదుగా కర్నూలు కొండారెడ్డి బురుజు దగ్గరకు చేరుకుని అక్కడ ప్రజనుద్దేశించి ప్రసగింస్తారని చెప్పారు. రాత్రికి కర్నూల్లోనే బస చేస్తారని పేర్కొన్నారు. 16న ఉదయం ఎమ్మిగనూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి సాయంత్రం 4 గంటలకు, మంత్రాలయం నియోజకర్గంలోని కోసిగిలో సాయంత్రం 6 గంటలకు ప్రచార కార్యక్రమంలో పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు.

నందికొట్కూరు: హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సోమవారం నందికొట్కూరు నియోజకవర్గంలో పర్యటించనున్నారు. సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు కర్నూలు జిల్లా పర్యటనను ముగించుకుని సాయంత్రం 4 గంటలకు నందికొట్కూరుకు చేరుకుంటారు. అక్కడ టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, నంద్యాల పార్లమెంట్ అభ్యర్థి బైరెడ్డి శబరి, నందికొట్కూరు ఎమ్మెల్యే అభ్యర్థి జయసూర్య, బీజేపీ, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జిలు బాలకృష్ణకు ఘనస్వాగతం పలుకుతారు. నందికొట్కూరు కొత్తబస్టాండ్ నుంచి పటేల్ సెంటర్ వరకు రోడ్డు షో నిర్వహిస్తారు. అక్కడ ప్రజలను ఉద్దేశించి మాట్లాడతారు. అనంతరం కర్నూలుకు బయలుదేరతారు.

సానుభూతి కోసమే సీఎం డ్రామాలు

టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్



మాట్లాడుతున్న నంద్యాల టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్

ఓర్వకల్లు, ఏప్రిల్ 14: ప్రజల నుంచి సానుభూతి పొందడం కోసమే సీఎం జగన్ మళ్లీ డ్రామాలు ఆడుతున్నాడని నంద్యాల టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ అన్నారు. ఆదివారం మండలంలోని హుశేనాపురం గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం జగన్‌పై జరిగిన రాళ్ల దాడి డ్రామా అని విమర్శించారు. బస్సు యాత్రలో జగన్ పర్యటనలో కరెంటు పోవడం, చీకటిలోనే రోడ్‌షో నిర్వహించడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. సీఎం సభకు భద్రత, పోలీసు బలగాలు ఉన్నా రాళ్ల దాడి ఎలా జరుగుతుందని ఆయన ప్రశ్నించారు. జగన్ డ్రామాలను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో మహబూబ్ బాషా, కాపు సంఘం నాయకులు కేవీ మధు, నాయకులు బజారువలి, వేణు, పాల్గొన్నారు.

ఇప్పటి వరకు 13 వేల దరఖాస్తులు

- నేటితో ముగియనున్న పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తుల ప్రక్రియ
- 85 సంవత్సరాలు పూర్తయిన వారికి, దివ్యాంగులకు ఏప్రిల్ 22 వరకు అవకాశం
- ఫెసిలిటేషన్ సెంటర్లలో వచ్చే నెల 5 నుంచి 8 వరకు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్

కర్నూలు(కలెక్టరేట్), ఏప్రిల్ 14: జిల్లాలో ఎన్నికల విధులు నిర్వహిస్తున్న 33 విభాగాలకు చెందిన ఉద్యోగులు, పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకున్నారు. జిల్లాలో 13 వేలు దరఖాస్తులు రాగా, ఇతర జిల్లాల వారు సుమారుగా వెయ్యి మంది దరఖాస్తు చేసుకున్నట్టు సమాచారం. నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి లేదా తహసీల్దార్ అధికారి కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకోవడానికి సోమవారంతో గడువు ముగియనుంది. 85 సంవత్సరాలు పైబడిన వారికి, దివ్యాంగులకు ఈ నెల 22వ తేదీ వరకు పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. జిల్లాలోని కర్నూలు నియోజకవర్గంలో అత్యధికంగా 3వేలు, అత్యల్పంగా మంత్రాలయం 1000, కోడుమూరు ఎమ్మిగనూరు, పత్తికొండ, ఆలూరు, ఆదోని పాణ్యం నియోజకవర్గాలకు సంబంధించి దాదాపు 1500 మంది పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకున్నారని ప్రాథమిక సమా చారం. పార్లమెంటుకు ఒక అబ్జర్వర్, కర్నూలు, కోడుమూరు మంత్రాలయం, ఎమ్మిగనూరు, నియోజకవర్గాలకు ఒక జనరల్ అబ్జర్వర్, ఆలూరు, ఆదోని, పత్తికొండ నియెజకవర్గాలకు ఒక జనరల్ అబ్జర్వర్, కర్నూలు, నంద్యాల ఉమ్మడి జిల్లాకు పోలీసు డిపార్టుమెంట్‌కు సంబంధించి ఒక అబ్జర్వర్ రానున్నారు. నియోజకవర్గంలోని క్రిటికల్, వల్నరబుల్ పోలింగ్ కేంద్రాలు, మౌలిక సదుపాయాలను తనిఖీ చేయనున్నారు.

అత్యవసర పోలీస్ సేవలకు ఫోన్ చేయండి: ఎస్పీ

నంద్యాల క్రైం, ఏప్రిల్ 14: నంద్యాల జిల్లాలో అత్యవసర పోలీస్ సేవల కోసం ప్రజలు 08514-225097కు కాల్ చేయాలని ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. ఎక్కడైనా అల్లర్లు, గొడవలు, శాంతిభద్రతలకు విఘాతం కలిగినా లేక ప్రజలు ఎవరైనా ప్రమాదంలో ఉన్నా వెంటనే ఈ నెంబర్‌కు ఫోన్ చేస్తే సత్వర పోలీస్ సేవలు అందుతాయని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా పోలీసులు 24గంటలు అప్రమత్తంగా ఉంటారని, పై నెంబర్‌కు ఫోన్ చేసి సహాయం కోరవచ్చని సూచించారు. అలాగే జిల్లాలో ఎక్కడైనా మట్కా, జూదం, క్రికెట్ బెట్టింగ్ ఇతర నేరాలు జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. అలా సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని చెప్పారు.

మల్లన్న సన్నిధిలో సీఎంవో ప్రిన్సిపల్ సెక్రటరీ



ఆలయ ప్రాంగణంలో ప్రిన్సిపల్ సెక్రటరీ ముత్యాల రాజు

శ్రీశైలం, ఏప్రిల్ 14: శ్రీశైల మల్లికార్జున స్వామి, భ్రమరాంబ అమ్మవార్లను ఆదివారం ఏపీ సీఎంవో ప్రిన్సిపల్ సెక్రటరీ ముత్యాల రాజు దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ కార్యనిర్వహణాధికారి డి. పెద్దిరాజు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్వామికి అభిషేకం నిర్వహించుకుని అనంతరం భ్రమరాంబికాదేవిని దర్శించుకున్నారు. దర్శ నానంతరం అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో ప్రిన్సి పల్ సెక్రటరీకి వేదపండితులు వేదాశీర్వచం పలికి తీర్థప్రసాదాలను అంద జేశారు. అనంతరం అధికారులు స్వామి శేషవస్త్రం, ప్రసాదాలను అందజేసి సత్కరించారు.

'ఊరిమర్లు' కథా సంపుటికి ఉత్తమ పురస్కారం

కర్నూలు(కల్చరల్), ఏప్రిల్ 14: కర్నూలుకు చెందిన కథా రచయిత మారుతి పౌరోహితం రాసిన 'ఊరిమర్లు' కథా సంపుటికి 'సడ్లపల్లె ఉత్తమ కథా పురస్కారం-2024' లభించింది. హిందూపురంలోని తపన సాహితీ వేదిక ఉత్తమ సాహిత్యాన్ని ప్రోత్సహించే ఉద్దేశంతో 2022-23లో ముద్రితమైన కథా సంపుటాలను ఆహ్వానించింది. ఐదు రాష్ట్రాల నుంచి 60 పుస్తకాలు పోటీ పడగా, వాటిలో మారుతి రాసిన ఊరిమర్లు సడ్లపల్లె ఉత్తమ కథా పురస్కారానికి ఎంపికైంది. ఈ పురస్కారం కింద రచయితకు రూ.10వేలు నగదు అందజేస్తున్నామని తపన సాహిత్య వేదిక అధ్యక్షుడు సడ్లపల్లె చిదంబరరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

టీడీపీ జిల్లా అధ్యక్షుడిగా తిక్కారెడ్డి

- ప్రధాన కార్యదర్శిగా ఆకెపోగు ప్రభాకర్
- రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మీనాక్షినాయుడు
- పార్లమెంట్ ఎన్నికల పరిశీలకుడిగా బీటీ నాయుడు
- జిల్లాలో ముఖ్య నాయకులకు కీలక బాధ్యతలు
- ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రక్షాళన



తిక్కారెడ్డి



ఆకెపోగు ప్రభాకర్



మీనాక్షినాయుడు

కర్నూలు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల మహా సంగ్రామానికి మిగిలిన సమయం 28 రోజులే. నాలుగు రోజుల్లో కీలకమైన నామినేషన్ల పర్వం మొదలు కానుంది. జిల్లాలో కర్నూలు పార్లమెంట్ సహా ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో విజయమే లక్ష్యంగా టీడీపీ అధినేత చంద్రబాబు పావులు కదుపుతున్నారు. టీడీపీ టికెట్ ఆశించి నిరుత్సాహంతో ఉన్న వారితోపాటు సీనియర్ నాయకుల సేవలు ఉపయోగించుకొని కర్నూలు కొండారెడ్డి బురుజుపై పసుపు జెండా ఎగురవేసేందుకు వ్యూహాత్మక అడుగులు వేస్తున్నారు. ఇందులో భాగంగానే పార్టీ ప్రక్షాళనకు శ్రీకారం చుట్టారు. ఈ మేరకు పలువురికి కీలక బాధ్యతలు అప్పగించారు. మంత్రాలయం టికెట్ ఆశించిన పి.తిక్కారెడ్డికి టీడీపీ కర్నూలు పార్లమెంట్ (జిల్లా) అధ్యక్ష పదవి ఇచ్చారు. కోడుమూరు టికెట్ ఆశించిన ఆ నియోజకవర్గం ఇన్‌చార్జి ఆకెపోగు ప్రభాకర్‌కు ప్రధాన కార్యదర్శి, ఆదోని టికెట్ ఆశించిన సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే కె.మీనాక్షినాయుడుకు రాష్ట్ర ఉపాధ్యక్ష పదవి ఇచ్చారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బీటీ నాయుడుకు కర్నూలు పార్లమెంట్ ఎన్నికల పరిశీలకులుగా బాధ్యతలు అప్పగించారు. వీరితో పాటు పలువురు ముఖ్యమైన నాయకుల సేవలను పార్టీకి ఉపయోగించుకునేలా జిల్లా, రాష్ట్ర స్థాయి బాధ్యతలు అప్పగించారు.

బుజ్జగించి పార్టీ సేవల్లోకి..

ఈ ఎన్నికల్లో టీడీపీ టికెట్‌పై పూర్తిగా ఆశలు పెట్టుకున్న పలువురు నాయకులకు రాజకీయ, సామాజిక సమీకరణలు, పొత్తుల వల్ల టికెట్ దక్కలేదు. దీంతో నాయకులు, వారి అనుచరులు అసంతృప్తితో రగిలిపోయారు. ఇందులో భాగంగానే ఆదోని టికెట్ ఆశించిన ఆదోని మాజీ ఎమ్మెల్యే కె.మీనాక్షినాయుడుకు నిరాశే మిగిలింది. పొత్తులో భాగంగా ఆ స్థానాన్ని బీజేపీకి కేటాయించారు. ఈ మేరకు అసంతృప్తితో ఆయనకు టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్ష పదవి ఇచ్చారు. మంత్రాలయం నుంచి రెండు పర్యాయాలు పోటీ చేసిన టీడీపీ ఇన్‌చార్జి పి.తిక్కారెడ్డి తనకు టికెట్ ఖాయమని భావించారు. అయితే.. సామాజిక సమీకరణల్లో భాగంగా ఆ నియోజకవర్గంలో అధికంగా ఉన్న వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన మాధవరం నల్లగౌని రాఘవేంద్రరెడ్డికి టికెట్ ఇచ్చారు. దీంతో తిక్కారెడ్డి, ఆయన వర్గీయులు తీవ్ర అసంతృప్తికి లోనయ్యారు. స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దిగేందుకు సైతం వెనుకాడలేదు. ఈ క్రమంలోనే జిల్లా టీడీపీ అధ్యక్ష బాధ్యతలు తిక్కారెడ్డికి అప్పగించారు. ప్రస్తుతం ఆ పదవిలో ఉన్న ఎమ్మెల్సీ బీటీ నాయుడును కర్నూలు పార్లమెంట్ ఎన్నికల పరిశీలకులుగా నియమించారు. కోడుమూరు (ఎస్సీ) నియోజకవర్గం టికెట్ ఆశించి భంగపడిన నియోజకవర్గం ఇన్‌చార్జి ఆకెపోగు ప్రభాకర్‌తో యువనేత నారా లోకేశ్ ఇటీవల బుజ్జగించారు. ఆయనకు టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పదవి ఇచ్చారు.

ఎన్నికల పరిశీలకులుగా..

బీటీ నాయుడును కర్నూలు పార్లమెంట్ ఎన్నికల పరిశీలకులుగా నియమించారు. వైసీపీకి రాజీనామా చేసి టీడీపీలో చేరిన కర్నూలు ఎంపీ డాక్టర్ ఎస్.సంజీవ కుమార్ ఈ ఎన్నికల్లో ఎంపీ టికెట్ ఆశించారు. కురవ సామాజికవర్గానికి చెందిన నాయకుడికి ఇవ్వాలని ముందు పార్టీ నిర్ణయించింది. దీంతో ఎంపీ డాక్టర్ సంజీవకుమార్‌ను ఎమ్మిగనూరు, కోడుమూరు నియోజకవర్గాల ఎన్నికల పరిశీలకులుగా బాధ్యతలు అప్పగించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లుకు ఆలూరు, పత్తికొండ నియోజవర్గాల ఎన్నికల బాధ్యతలు అప్పగించారు.

మరికొందరికి..



బొజ్జమ్మ



కొంగతి లక్ష్మీనారాయణ



మాచాని సోమనాథ్

మాచాని సోమనాథ్‌కు టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కొంగతి లక్ష్మీనారాయణకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి బాధ్యతలు అప్పగించారు. ఫుడ్ కార్పొరేషన్ మాజీ సభ్యురాలు గుడిసె కృష్ణమ్మకు రాష్ట్ర తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి, బస్సాపురానికి చెందిన ఏసీ శ్రీకాంత్‌రెడ్డికి పార్టీ రాష్ట్ర కార్యదర్శి, ముస్లిం మైనార్టీ నాయకుడు ఉమ్మి సలీంకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి బాధ్యతలు ఇచ్చారు. ఆలూరు టికెట్ ఆశించిన వైకుంఠం జ్యోతి భర్త, నియోజకవర్గం మాజీ ఇన్‌చార్జి వైకుంఠం శివప్రసాద్‌కు, పత్తికొండ నియోజకవర్గ సీనియర్ నాయకుడు, శాలివాహన కార్పొరేషన్ మాజీ చైర్మన్ తుగ్గలి నాగేంద్రకు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి వంటి కీలక బాధ్యతలు చంద్రబాబు అప్పగించారు. ఆలూరు టికెట్ ఆశించి వైసీపీచేరిన భంగపడిన కప్పట్రాళ్ల బొజ్జమ్మకు రాష్ట్ర పార్టీ కార్యదర్శి పదవి ఇచ్చారు. కర్నూలు నగరానికి చెందిన వేముల సుమన్ చౌదరికి పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఇచ్చారు.

చంద్రబాబు నమ్మకాన్ని నిలబెడతా

అధినేత చంద్రబాబు, యువనేత నారా లోకేశ్ నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటా. గురుతర బాధ్యతగా స్వీకరించి ఎన్నికల్లో ఎంపీ సహా ఏడుగు నియోజకవర్గ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేస్తా. పార్టీలో కష్ట పడి పని చేసే వారికి సముచిత స్థానం కల్పిస్తాం.

- తిక్కారెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు

ఆడపిల్లలకు నిర్మల స్ఫూర్తి

పేద విద్యార్థినిని అభినందించిన కలెక్టర్



విద్యార్థిని నిర్మలను అభినందిస్తున్న కలెక్టర్

కర్నూలు(కలెక్టరేట్), ఏప్రిల్ 14: ఆడపిల్లలకు నిర్మల స్ఫూర్తి అని కలెక్టర్ డా.జి.సృజన అన్నారు. ఇంటర్ బైపీసీ మొదటి సంవత్సరం వార్షిక పరీక్షలో 421/440 మార్కులు సాధించిన ఆ విద్యార్థినిని కలెక్టర్ తన క్యాంపు కార్యాలయానికి పిలిపించుకుని అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆడపిల్లలకు నిర్మల రోల్ మోడల్ అని ప్రశంసించారు. ఎన్ని ప్రతిఘటనలు ఎదురైనప్పటికీ ఉక్కు హృదయంతో, దృఢ సంకల్పంతో చదువుకోవాలన్న తన కోరికను నెరవేర్చుకుని ఉన్నత ఆశయంతో ముందుకు వెళతోందని కొనియాడారు. విద్యతోనే సాధికారత లభించగలదని, ఆడపిల్లలు చదువుకుని సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందాలని అన్నారు. బేటి బచావో.. బేటి పడావో కింద నిర్మలకు ఇన్సెంటివ్ ఇవ్వాలని ఇన్‌చార్జి ఐసీడీఎస్ పీడీ అధికారిని ఆదేశించారు. సమస్యల వల్ల మధ్యలో చదువు ఆపేసిన వారు ఎవరైనా ఉంటే స్పెషల్ క్యాంపెయిన్ నిర్వహించి అలాంటి వారిని ఈ సంవత్సరం కేజీబీవీలలో అడ్మిషన్ చేయించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం కలెక్టర్ విద్యార్థి నిర్మలను శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా విద్యార్థిని నిర్మల మాట్లాడుతూ పదో తరగతిలో 537 మార్కులు సాధించానని, తల్లిదండ్రులే ఆర్థిక సమస్యల వల్ల పై చదువులు వద్దని పెళ్లి చేయాలని నిర్ణయించుకున్నారని తెలిపింది. కలెక్టర్ స్పందించి కేజీబీవీలో తనను అడ్మిషన్ చేయించారని తెలిపారు. కలెక్టర్ చేసిన మేలు మర్చిపోలేనని చెప్పింది. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్, సర్వశిక్ష అభియాన్ ఏపీసీ విజయ జ్యోతి, ఇన్‌చార్జి ఐసీడీఎస్ పీడీ వెంకట లక్ష్మమ్మ, గర్ల్ చైల్డ్ డెవలప్మెంట్ ఆఫీసర్ సునీత, కేజీవీవీ ప్రిన్సిపాల్ శరన్ స్మైలి, ఆదోని ఎంఈవో-2 శ్రీనివాసులు, విద్యార్థిని తల్లిదండ్రులు పాల్గొన్నారు.

టీడీపీలోనే కురువలు, వాల్మీకులకు ప్రాధాన్యం

కర్నూలు టీడీపీ ఎంపీ అభ్యర్థి బస్తిపాటి నాగరాజు



టీజీ భరత్, బస్తిపాటిని లను సన్మానిస్తున్న కురువ సంఘం నాయకులు

కర్నూలు(అర్బన్), ఏప్రిల్ 14: కురువలు, వాల్మీకులకు టీడీపీలో ప్రాధాన్యమని టీడీపీ ఎంపీ అభ్యర్థి బస్తిపాటి నాగరాజు అన్నారు. ఆదివారం నగరంలోని తనీష్ ఫంక్షన్ హాలులో కర్నూలు నియోజకవర్గం కురువల ఆత్మీయ సమావేశంలో బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్యే అభ్యర్థి టీజీ భరత్, జనసేన నాయకులు, కురువ సంఘం నాయకులతో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ కురువల పోరాట ఫలితంగానే తనకు ఎంపీ టికెట్ వచ్చిందన్నారు. జిల్లాలో 40 ఏళ్లగా కురువలకు ఎప్పుడూ ఏ పార్టీ ఎంపీ, ఎమ్మెల్యేగా టికెట్ ఇవ్వలేదని, మొదటి సారిగా టీడీపీ కురువలకు టిక్కెట్ కేటాయించిందన్నారు. ఏకతాటిపైకి వచ్చి టీడీపీని గెలిపించాలని కోరారు. ఎంపీగా గెలిపిస్తే కురువలను చైతన్య పరిచే దిశగా మారుస్తానన్నారు. కురువ సంఘం నాయకులు ప్రతి ఒక్కరూ కలిసి తెలుగుదేశం పార్టీకి ఓటు వేసేలా చైతన్యం తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో జనసేన నాయకులు అర్షద్, పవన్‌కుమార్, కార్పొరేటర్ కురువ పరమేష్, ఎల్లప్ప రాజు, ఆనంద్, ఉమామహేశ్వరి, శ్రీలీల, గురువులమ్మ, ఆర్టీసీ నారాయణ, తౌడు శ్రీను, మదాసీ సుంకన్న, మద్దిలేటి , బత్తిన కిరణ్, మహానంది, తిరుమలేష్, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

కోడుమూరులో కొనసాగుతున్న వలసల పర్వం

టీడీపీలో చేరిన నాలుగు గ్రామాల వైసీపీ శ్రేణులు



విష్ణువర్ధన్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరిన పూడూరు వైసీపీ నాయకులు

కర్నూలు(రూరల్), ఏప్రిల్14: కోడుమూరు నియోజకవర్గంలో టీడీపీలోకి వలసల పర్వం కొనసాగుతోంది. ప్రతి రోజూ వివిధ గ్రామాల నుంచి వైసీపీ శ్రేణులు ఆ పార్టీని వీడుతున్నాయి. కర్నూలు రూరల్, కోడుమూరు, గూడూరు, సీ బెలగల్ మండలాల్లో టీడీపీకి మరింత ఆదరణ పెరుగుతోంది. తాజాగా ఆదివారం కర్నూలు రూరల్ మండలం పూడూరు గ్రామానికి చెందిన కాశీ, మాజీ సర్పంచు మల్లికార్జున ఆధ్వర్యంలో దాదాపు 50 కుటుంబాలు టీడీపీ సీనియర్ నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి సమక్షంలో టీడీపీలోకి చేరాయి. వారికి ఆయన టీడీపీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. టీడీపీలో చేరిన వారిలో లక్ష్మయ్య, రాము, పరమేష్, భాస్కర్, నేతాజీ, రవి, భాస్కర్, శేఖర్, సర్వేశ్వరాజు, సురేష్, మద్దిలేటి, రామకృష్ణ, శ్రీరామ్, దేవనాయుడు మరికొంత మంది ఉన్నారు.

- గూడూరు పట్టణానికి చెందిన కిందిగేరి చెందిన 40కుటుంబాలు వైసీపీని వీడాయి. స్థానిక టీడీపీ నాయకులు రామాంజనేయులు, గజేంద్రగోపాల్‌నాయుడు షాషా, వెంకటేష్, ఆధ్వర్యంలో కర్నూలులో టీడీపీ సీనియర్ నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. వారకి టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీలో చేరిన వారిలో రామకృష్ణ, వెంకి, మధు, సూరి, రంగస్వామి, ఉదయ్, వినయ్, జయరాం, శ్రీనివాసులు, భరత్, రఫీక్, ప్రహ్లాద, శివ మరికొంతమంది ఉన్నారు.
- కర్నూలు రూరల్ మండలం ఉల్చాల గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు రాఘవేంద్ర ఆధ్వర్యంలో పలువురు వైసీపీ నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. టీడీపీలో చేరిన వారిలో గొల్లగోపాల్, ప్రతాప్‌రెడ్డి, హరికృష్ణ, గొల్ల మధు, నరేష్, గిడ్డయ్య, దేవేందర్, వెంకటేష్, సురేష్, శివ, రవి, శివ మరికొందరు ఉన్నారు.
- కర్నూలు రూరల్ మండలం దిన్నెదేవరపాడు పరిధిలో ఉన్న వెంకన్నబావి నుంచి రాముడు ఆధ్వర్యంలో 50 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. పార్టీలో చేరిన వారిలో కళ్యాణ్, శంకర్, అరుణ్, ఏసన్న, ఉపేంద్ర, సునీల్, వెంకటేష్, కృష్ణ, ఈశ్వరయ్య, ఆదాం, పవన్, నూకరాజు, మురళి, ప్రతాప్, లక్ష్మన్న, ఉన్నారు.
- కోడమూరు మండలం ప్యాలకుర్తి గ్రామానికి చెందిన యూసూఫ్, అలీమ్ ఆధ్వర్యంలో మైనార్టీ కుటుంబాలు వైసీపీని వీడి కర్నూలులో విష్ణువర్ధన్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరాయి. వారికి టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీలో చేరిన వారిలో అలీమ్‌బాషా, సుభాన్, షేక్షావలి, సలీం, ఖలీల్, రఫీ, మద్దిలేటి, ఇస్మాయిల్, మన్సూర్, మహబూబ్, అన్వర్, యూసూఫ్ తదితరులు ఉన్నారు.

17లోపు మరమ్మతు పనులను పూర్తి చేయండి: కలెక్టర్

కర్నూలు(కలెక్టరేట్), ఏప్రిల్ 14: రాష్ట్ర ప్రభుత్వ అతిథి గృహంలో చేయాల్సిన మరమ్మతు పనులను ఈనెల 17వ తేదీలోపు పూర్తి చేయాలని కలెక్టర్ జి.సృజన ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు. ఆదివారం రాష్ట్ర ప్రభుత్వ అతిథి గృహంలోని గదులను, మీటింగ్ హాల్‌లో జరుగుతున్న మరమ్మతు పను లను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సాధారణ ఎన్నికల నేపథ్యంలో జిల్లాకు ఎన్నికల పరిశీలకులు రానున్నారని, రెండు వీఐపీ రూములు, నాలుగు గదులు సిద్ధం చేయాలన్నారు. పరిసరాల్లో ఎటువంటి చెత్తాచెదారం ఉండకుండా వాటిని తొలగించాలన్నారు. కలెక్టర్ వెంట డీఆర్వో మధుసూదన్‌రావు, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ నాగరాజు, ఈఈ సురేష్, డీఈ రవిచంద్ర పాల్గొన్నారు.

పాముకాటుకు డ్రైవర్ మృతి

కేసు నమోదు

మంత్రాలయం, ఏప్రిల్ 14: మండలంలోని మాధవరం సమీపంలో మారుతి ఇస్పాత్ లిమిటెడ్ (స్టీల్ ఫ్యాక్టరీలో) డ్రైవర్‌గా పని చేస్తున్న బందెనవాజ్ పాముకాటుకు గురై మృతి చెందాడు. ఈ ఘటన శనివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. మాధవరం ఎస్ఐ కృష్ణమూర్తి, బందెనవాజ్ బంధువులు తెలిపిన వివరాల మేరకు.. రాయచూరు జిల్లా ఇడుపునూరు గ్రామానికి చెందిన బందెనవాజ్ మాధవరం స్టీల్ ఫ్యాక్టరీలో రెండేళ్లుగా డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. శనివారం ఫ్యాక్టరీలో ఉన్న సిబ్బందిని వాహనంలో ఎక్కించుకుని రైల్వేస్టేషన్‌లో దించి తిరిగి ఫ్యాక్టరీకి చేరుకున్నాడు. వాహనాన్ని పార్కింగ్ చేసి మూత్రవిసర్జనకు పక్కనే ఉన్న చెత్త సమీపంలోకి వెళ్లగా అక్కడే ఉన్న పాము బందెనవాజ్‌ను కాటేసింది. గమనించిన నవాజ్ సెక్యూరిటికి సమాచారం ఇచ్చాడు. ఫ్యాక్టరీ యాజమాన్యం హుటాహుటిన బందెనవాజ్‌ను అంబులెన్సులో ఎమ్మిగనూరు ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రికి చేరుకునేలోపు విషప్రభావం ఎక్కువ కావడంతో మృతి చెందాడు. మృతునికి భార్య నసీమా, ఒక కొడుకు, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. మాధవరం ఎస్ఐ క్రిష్ణమూర్తి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గుండెపోటుతో యువ రైతు మృతి

కోసిగి, ఏప్రిల్ 14: మండల పరిధిలోని చిన్నభూంపల్లి గ్రామానికి చెందిన యువరైతు గట్టుమీద రామకృష్ణ (28) ఆదివారం గుండెపోటుతో మృతి చెందాడు. కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. రామకృష్ణకు రెండు ఎకరాల పొలం ఉంది. వ్యవసాయం చేస్తూ మిగతా సమయాల్లో డ్రైవర్‌గా వెళ్లేవాడు. ఈ నేపథ్యంలో ఎండుమిర్చిని గుంటూరుకు తీసుకెళ్లేందుకు బొలేరో వాహనానికి డ్రైవర్‌గా వెళ్లాడు. ఎమ్మిగనూరులో భోజనానికి వెళ్తున్న సమయంలో చాతిలో నొప్పి రావడంతో అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. వెంటనే ఆసుపత్రికి తరలించగా.. మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతునికి భార్య రాణి, ఒక కుమారుడు ఉన్నారు. ప్రభుత్వం బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.

జగన్ పాలనలో రాష్ట్రం సర్వనాశనం: బైరెడ్డి

కొత్తపల్లి, ఏప్రిల్ 14: జగన్ పాలనలో రాష్ట్రం సర్వనాశనమైందని బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి మండలంలోని దుద్యాల గ్రామంలో వైసీపీ మండల మైనార్టీ నాయకులు జీఎండీ రఫి ఆధ్వర్యంలో సుమారు 500 మందికి పైగా వైసీపీని వీడి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరికి బైరెడ్డి టీడీపీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ముందుగా బైరెడ్డి సమక్షంలో మండలంలోని జడ్‌వారిపల్లిలో 30 కుటుంబాలు, ఎదురుపాడులో 35 కుటుంబాలు, స్థానిక నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, కుమ్మరి నారాయణ ఆధ్వర్యంలో వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. అనంతరం దుద్యాలలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో బైరెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్ మూడు రాజధానుల పేరుతో రాష్ట్రాన్ని మూడు ముక్కలు చేశారని ఆరోపించారు. నాయకులు చెరుకుచెర్ల రఘురామయ్య, మల్లారెడ్డి, రామక్రిష్ణారెడ్డి, మన్సూర్, రాజు, నాగన్న, నాగన్నతో పాటు స్థానిక గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం: మాండ్ర


పారుమంచాలలో మాట్లాడుతున్న మాండ్ర శివానందరెడ్డి

జూపాడుబంగ్లా, ఏప్రిల్ 14: టీడీపీతోనే బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం సాధ్యమని ఆ పార్టీ టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి అన్నారు. మండలంలోని పారుమంచాల గ్రామంలో ఆదివారం సాయంత్రం జయహో బీసీ కార్యక్రమం మండల కన్వీనర్ వెంకటేశ్వర్లుయాదవ్ అధ్యక్షతన నిర్వహించారు.. జగన్ అధికారం చేపట్టాక రాష్ట్రంలో ప్రధానమైన బీసీ నాయకులు 75 మంది హత్యకు గురయ్యారని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా రిజర్వేషన్లు కల్పించి బీసీలకు చైతన్య పరిచిన ఏకైక పార్టీ టీడీపీ అని అన్నారు. నందికొట్కూరు టీడీపీ అభ్యర్థి గిత్తా జయసూర్య, నాయకులు వెంకట రమణరెడ్డి, శివరామిరెడ్డి, మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి, నారాయణరెడ్డి, సుధాకర్, శ్రీనివాసులు, రవికుమార్‌యాదవ్, పెద్దన్న, శేఖర్ కార్యకర్తలు పాల్గొన్నారు.

'వ్యవస్థలన్నీ చిన్నాభిన్నం'

గోస్పాడు, ఏప్రిల్ 14: రాష్ట్రంలో వ్యవస్థలన్నీ చిన్నాభిన్నమయ్యాయని నంద్యాల టీడీపీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ బైరెడ్డి శబరి, నంద్యాల ఎమ్మెల్యే టీడీపీ అభ్యర్థి, పొలిట్ బ్యూరో సభ్యుడు ఎన్ఎండీ ఫరూక్, ధ్వజమెత్తారు. ఆదివారం మండలంలోని యాళ్ళూరు గ్రామంలో మాజీ ఉపసర్పంచ్ గంగుల వెంకటరెడ్డి, గంగుల శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తూ ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఎన్ని జిమ్మిక్కులు చేసినా నంద్యాలలో వైసీపీ ఓడిపోవడం ఖాయమని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తాతిరెడ్డి తులసిరెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు కాటంరెడ్డి తులసీశ్వరరెడ్డి, నాయకులు బి.ప్రసాద్, రమణ, వడ్డె శ్రీను, భారీ ఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.

'సీఎం జగన్‌ను ప్రజలు నమ్మరు'

బండిఆత్మకూరు, ఏప్రిల్ 14: రాష్ట్రంలో ఇక సీఎం జగన్ నాటకాలను ప్రజలు ఎవరూ నమ్మరని టీడీపీ నాయకులు సురేష్‌రెడ్డి, మనోహర్ చౌదరి, బుగ్గరాముడు, చిన్న లింగారెడ్డి, జాకీర్ అన్నారు. ఆదివారం వారు మాట్లాడుతూ సాక్షాత్తూ ముఖ్యమంత్రి పర్యటనలో పలు దఫాలు, పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోవటం వెనుక ఆంతర్యం ఏమిటని? ప్రశ్నించారు.

సమస్యల పరిష్కారానికి కృషి: గౌరు చరిత

పాణ్యం, ఏప్రిల్ 14: టీడీపీ అధికారంలోకి రాగానే మొట్టమొదట కాలనీలో మురుగు కాలువలు, రోడ్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గౌరు చరిత అన్నారు. తమ్మరాజుపల్లె, పిన్నాపురం, గోరుకల్లు, కొండజూటూరు గ్రామాలలో ఆదివారం శంఖారావంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ తమ్మరాజుపల్లెకు గుండెకాయవంటి ఏటిపాయ పర్కులేషన్ డ్యాం నిర్మాణాన్ని నలభై ఏళ్లయినా పూర్తి చేయలేకపోయారని ఎమ్మెల్యే కాటసానిపై మండిపడ్డారు. సహజసిద్ధమైన కొండలను కొల్లగొట్టి మట్టి, కంకరను అక్రమంగా దోచేసుకున్నారని ఆరోపించారు. బ్లాస్టింగ్‌లతో ఇల్లు కూలిపోతున్నా పట్టించుకోకుండా తమ ఆదాయం పెంచుకుంటున్నారన్నారు. గ్రామాలలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు జయరామిరెడ్డి, మాజీ జడ్పీటీసీ నారాయణమ్మ, మాజీ ఎంపీటీసీ వెంకటరమణ, రామ్మోహన్‌నాయుడు, దుబాయ్ శీను, చల్లా సురేష్, రాజేంద్ర, మధు, ఈడిగ శేఖర్, రవి, సురేష్, నారాయణ పాల్గొన్నారు.


తమ్మరాజుపల్లెలో ప్రచారం నిర్వహిస్తున్న గౌరు చరిత

● కొండజూటూరు గ్రామంలో ఆదివారం పాణ్యం టీడీపీ అభ్యర్థి గౌరు చరిత ఆధ్వర్యంలో పది వైసీపీ కుటుంబాలు టీడీపీలో చేరాయి. కార్యక్రమంలో శాంతప్ప, మాజీ సర్పంచ్ గంగనారాయణ, రాచమల్ల నాగిరెడ్డి, కేశన్న, పంచాయతీ వార్డు సభ్యులు ఎల్లాసుబ్బయ్య, మల్లయ్య, భోగేశ్వరుడు, మల్లికార్జున గౌడ్, శరువప్ప, పుల్లయ్య, రామయ్య, కోటయ్య సంజన్న పాల్గొన్నారు.

టీడీపీలో చేరిక

శ్రీశైలం, ఏప్రిల్ 14: శ్రీశైలం మండలం తన కంచు కోటగా భావిస్తున్న శిల్పా చక్రపాణిరెడ్డికి మండల ప్రజలు షాకుల మీద షాకులు ఇస్తున్నారు. శనివారం శ్రీశైలం దేవస్థానం పరిధిలో సుమారు 300 వందల కుటుంబాలకు పైగా వైసీపీని వీడి శ్రీశైలం నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి బుడ్డా రాజశేఖరరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరాయి. ఆదివారం సుండిపెంటలో వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. వైసీపీకి చెందిన మాల మహానాడు నాయకులైన సామేలు, రాజు, సాలేముల ఆధ్వర్యంలో వైసీపి భూత్ కన్వీనర్ రాజు, నాగేశ్వరరావు, చెన్నయ్య, చిన్నయ్య, షఫి, బంజార నాయకులైన భీములనాయక్, శినాయక్, శ్రీనునాయక్, బాలాజి నాయక్, సతీష్‌నాయక్‌తో కలిపి సుమారు 110 కుటుంబాలు టీడీపీలో చేరాయి. వీరికి బుడ్డా రాజశేఖరరెడ్డి కండువాలు కల్పి పార్టీలోనికి ఆహ్వానించారు. వారు మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలనలో శిల్పా చక్రాణిరెడ్డి ఓటు బ్యాంకుగానే దళితులను, గిరిజనులను వాడుకున్నారే తప్ప, తమకు ఎలాంటి సహాయ సహకారాలు అందించలేదని


బుడ్డా సమక్షంలో టీడీపీలో చేరిన ప్రజలు

పశుగ్రాసం దగ్ధం

గడివేముల, ఏప్రిల్ 14: మండలంలోని ఒండుట్ల గ్రామంలో విద్యుదాఘాతంతో ఆదివారం ట్రాక్టర్‌లో తీసుకెళ్తున్న పశుగ్రాసం దగ్ధమైంది. ఒండుట్ల గ్రామానికి చెందిన సుబ్బరాయుడు ఎల్‌కే తండాలో సొప్ప కొనుగోలు చేసి గ్రామానికి తీసుకు వస్తుండగా విద్యుత్ తీగలు తగిలి మంటలు చెలరేగాయి. దీంతో డ్రైవర్ అప్రమత్తమై ట్రాలీలోని సొప్పను కిందకు వదిలేయడంతో ప్రమాదం తప్పింది. సొప్ప దగ్ధమవడంతో రూ.15 వేలు నష్టం వాటిల్లిందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు.

ఘనంగా అంబేడ్కర్ జయంతి


శ్రీశైలలో నివాళి అర్పిస్తున్న బుడ్డా

నంద్యాల టౌన్, ఏప్రిల్ 14: నంద్యాల జిల్లా ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కార్యాలయంలో అంబేడ్కర్ జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. నంద్యాల అసెంబ్లీ కాంగ్రెస్ అభ్యర్థి గోపవరం గోకుల్ కృష్ణారెడ్డి బొమ్మలసత్రం సర్కిల్‌లో ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళి అర్పించారు. నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనస్థానంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని నిర్వహించారు.

నంద్యాల (నూనెపల్లె): అంబేడ్కర్ సంస్కరణలకు ఆద్యుడని నంద్యాల అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి ఎన్ఎండీ ఫరూక్, మాజీ ఎమ్మెల్యే భైరెడ్డి రాజశేఖరరెడ్డి అన్నారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఆదివారం టీడీపీ కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు.

నంద్యాల క్రైం: నంద్యాల బార్ అసోసియేషన్ కార్యాలయంలో ఘన నివాళి అర్పించారు. అధ్యక్షుడు గోళ్ల జయకృష్ణ పూలమాలవేశారు. అనంతరం ఏపీపీ తిరుపతి, సీనియర్ న్యాయవాది జి.శ్రీనివాసులు తదితరులతో కలిసి కేక్ కట్ చేశారు.

నంద్యాల (కల్చరల్): నంద్యాల బీజేపీ పార్లమెంట్ కార్యాలయంలో అంబేడ్కర్ జయంతిని నిర్వహించారు. పార్లమెంట్ కోఆర్డినేటర్ అభిరుచి మధు పాల్గొన్నారు.

ఆత్మకూరు: ఆత్మకూరులో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ప్రముఖ వైద్యులు, ఎమ్మార్పీఎస్, మాల మహానాడు, కుల వివక్ష పోరాట సమితి నాయకులు పాల్గొన్నారు.

● ఆత్మకూరులో అంబేడ్కర్ విగ్రహానికి శ్రీశైల దేవస్థానం మాజీ ట్రస్టుబోర్డు ఛైర్మన్ వంగాల శివరామిరెడ్డి, టీడీపీ మండల, పట్టణాధ్యక్షులు శివప్రసాద్‌రెడ్డి, వేణుగోపాల్, దళిత సంఘాల నాయకులు తిమోతి, రమణలు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కలీముల్లా, అబ్దుల్లాపురం బాషా, రామ్మూర్తి, సుబ్బయ్య, షఫీ తదితరులు ఉన్నారు.

శ్రీశైలం: అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని సుండిపెంట స్టోర్ సర్కిల్‌లో విగ్రహం వద్ద నివాళి అర్పించారు. మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

గోస్పాడు: కానాలపల్లె అంబేడ్కర్ యూత్ సభ్యులు అంబేడ్కర్ జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

బండిఆత్మకూరు: బండిఆత్మకూరులో అంబేడ్కర్ జయంతిని నిర్వహించారు. వ్యవసాయ కార్మిక సంఘం, సీపీఎం, ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు. ఎ.కోడూరులో సర్పంచ్ జ్ఞానభరణం ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి నిర్వహించారు.

వెలుగోడు: టీడీపీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతిని నిర్వహించారు. టీడీపీ నాయకులు కలాం ఖలీల్, పండ్ల శంకర్‌రెడ్డి పాల్గొన్నారు. అలాగే సీఐటీయూ, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతిని నిర్వహించారు.

మహానంది: మహానందిలోని టీడీపీ కార్యాలయంలో అంబేడ్కర్ జయంతిని నిర్వహించారు. నాయకులు శ్రీనివాసులు, చంద్ర, ఖాజాహుస్సేన్, గంగాధర్‌రెడ్డి, జమాల్, ఎల్లయ్య, నరేష్, లక్ష్మీనారాయణ, ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు. అలాగే మహానంది వ్యవసాయ కళాశాలలో అంబేడ్కర్ జయంతిని నిర్వహించారు.

నందికొట్కూరు: పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద టీడీపీ నాయకులు మాండ్ర లింగారెడ్డి పూలమాల వేసిన ఇవాళి అర్పించారు. నాయకులు ప్రసాద్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, మహేశ్వరరెడ్డి, భాస్కర్‌రెడ్డి, ముర్తుజావలి, జాకీర్‌హుస్సేన్, జమీల్, రసూల్, నాగముని, మోహన్, రాజు, రాజన్న, కళాకార్, గిరి, శ్రీను పాల్గొన్నారు. అంబేడ్కర్ ఆశయ సాధ కోసం పని చేస్తామని ఏఐఎస్‌యూ నాయకులు అన్నారు. ఫెడరేషన్ ఆఫ్ యూత్ అసోసియేషన్, ఎఫ్ఐవైఏ నాయకులు పాల్గొన్నారు.

నందికొట్కూరు రూరల్: నందికొట్కూరు మండల అభివృద్ధి కార్యాలయంలో మండల విస్తరణ అధికారి సంజన్న ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతిని నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శులు రవీంద్రబాబు, గోపాలు, నూరుల్లా తదితరులు పాల్గొన్నారు.

పగిడ్యాల: పగిడ్యాల ఎంపీడీవో కార్యాలయంలో ఎంఈవో మురళీమోహన్‌రెడ్డి, సిబ్బంది ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతిని నిర్వహించారు. నెహ్రూనగర్, లక్ష్మాపురంలో నివాళి అర్పించారు.

మిడుతూరు: చింతలపల్లి గ్రామంలో అంబేడ్కర్ జయంతిని మాజీ సర్పంచ్, టీడీపీ నాయకుడు వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. రంగారెడ్డి, రమణమ్మ, ఎలీషా, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా: జూపాడుబంగ్లాలో అంబేడ్కర్ జయంతిని నిర్వహించారు. ప్రజాసంఘాలు, సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

కొత్తపల్లి: కొత్తపల్లిలోని పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న అంబేడ్కర్ విగ్రహం, నందికుంట బస్‌స్టేషన్‌లో ఉన్న అంబేడ్కర్ విగ్రహాల వద్ద నివాళి అర్పించారు. నందికొట్కూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గిత్త జయసూర్య, మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి, శ్రీనాథరెడ్డి, నాగేశ్వరరావు యాదవ్, శివారెడ్డి, నడిపెన్న, మల్లయ్య, బ్రహ్మానందరెడ్డి, జహరుల్లా, స్వామిదాసు, మల్లికార్జున నాయక్ పాల్గొన్నారు.

పాములపాడు: మండల కేంద్రంలో అంబేడ్కర్ జయంతిని నిర్వహించారు. వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.


తమ్మరాజుపల్లెలో నివాళి అర్పిస్తున్న గౌరు చరిత

పాణ్యం: అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పాణ్యం మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. అంబేడ్కర్ జయంతి వేడుకలు తమ్మరాజుపల్లెలో నిర్వహించారు. రామ్మోహన్ నాయుడు, మధు, పార్థసారధి, సురేష్, రాజేంద్ర, ఎల్లానాయుడు, నాగరాజు, కృష్ణ, శేఖర్ పాల్గొన్నారు.

● అంబేడ్కర్ కూడలి వద్ద మాలమహానాడు, ప్రజా, విద్యార్థి సంఘాల, సీఐటీయూ నాయకులు నివాళి అర్పించారు.

గడివేముల: గడివేములలో కాంగ్రెస్ రాష్ట్ర ఎస్సీ సెల్ సెక్రటరీ రవికిరణ్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల, దళితుల సంక్షేమం కోసం పోరాడిన యోధుడు అంబేడ్కర్ అని కొనియాడారు.

వేగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో..

నందికొట్కూరు రూరల్, ఏప్రిల్ 14: మండలంలోని 10 బొళ్ళవరం గ్రామంలో వేగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. వ్యవస్థాపక అధ్యక్షుడు బోరెల్లి వెంకటరాముడు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి, కుల వివక్ష, అంటరానితనం నిర్మూలనకు అంబేడ్కర్ ఎంతో కృషి చేశారని కొనియాడారు. వచ్చే ఎన్నికల్లో ఓటును అమ్ముకోవద్దని, ఇది ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు బండి నాగరాజు, సభ్యులు బి.రాముడు, బి.శేషన్న, శివ, పి.నాగరాజు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.


అంబేడ్కర్ జయంతి వేడుకల్లో వేగా ఫౌండేషన్ సభ్యులు

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

వైభవంగా చౌడేశ్వరిదేవి రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

బనగానపల్లె రూరల్, ఏప్రిల్ 14: మండలంలోని నందవరం గ్రామంలో ఉగాది బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరో రోజు ఆదివారం చౌడేశ్వరీదేవి రథోత్సవం వైభవంగా నిర్వహించారు. సాయంత్రం 5 గంటలకు ఆలయ అసిస్టెంట్ కమిషనర్, ఈఓ జి.కామేశ్వరమ్మ, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో రథంపై ఉత్సవమూర్తులను కూర్చొబెట్టి సంప్రదాయబద్ధంగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మంగళవాయిద్యాలు, మేళతాళాల మధ్య భక్తులు రథాన్ని లాగుతూ ఆలయం వద్దకు చేర్చారు.

అహోబిలంలో తమిళ ఉగాది

నంద్యాల, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): అహోబిలం లక్ష్మీనరసింహ స్వామి సన్నిధిలో ఆదివారం తమిళ ఉగాదిని వేదపండితులు నిర్వహించారు. ముందుగా దిగువ అహోబిలంలోని ఉత్సవమూర్తులైన ప్రహ్లాద వరదస్వామి, శ్రీదేవి, భూదేవిని వేకువజామునే అలంకరించి పూజలు నిర్వహించారు. అనంతరం వేదపండితులు నవ కలశ తిరుమంజనం చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు.

వైభవంగా సీతారాముల పల్లకీ ఉత్సవం

చాగలమర్రి, ఏప్రిల్ 14: చాగలమర్రి గ్రామంలోని కోదండ రామ, పట్టాభిరామ ఆలయాల్లో శ్రీరామనవమి నవరాత్రుల సందర్భంగా సీతారాముల ఉత్సవమూర్తుల పల్లకీ ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆదివారం మహిళలు సీతారాములకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఎస్ఎస్ఎఫ్ మహిళా సభ్యుల కన్వీనర్ భవాని ఆధ్వర్యంలో భజన కార్యక్రమాలు నిర్వహించారు.

● చాగలమర్రి గ్రామంలోని ఏకశిల పదునెట్టాంబడి అయ్యప్ప స్వామి ఆలయంలో ఆదివారం వేద పండితుడు పవన్‌కుమార్ ఆధ్వర్యంలో విష్ణు మహోత్సవం వైభవంగా నిర్వహించారు. అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. భక్తులకు నాణేలు సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బిజ్జంతో గడ్డం నాగేశ్వరరెడ్డి భేటీ

కోవెలకుంట్ల, ఏప్రిల్ 14: పాణ్యం మాజీ ఎమ్మెల్యే బిజ్జం పార్థసారథిరెడ్డితో కోవెలకుంట్ల టీడీపీ నాయకుడు, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ గడ్డం నాగేశ్వరరెడ్డి ఆదివారం కోవెలకుంట్లలో భేటీ అయ్యారు. బిజ్జంను కోవెలకుంట్ల పట్టణంలోని మారంరెడ్డి భాస్కర్‌రెడ్డి ఇంటి వద్ద కలసి టీడీపీకి మద్దతు ఇవ్వా లని కోరారు. అలాగే బనగానపల్లె ఎమ్మెల్యే అభ్యర్థి బీసీ జనార్దన్‌రెడ్డి, నంద్యాల టీడీపీ ఎంపీ అభ్యర్థి శబరి గెలుపుకు కృషి చేయాలని కోరినట్లు తెలిపారు. బిజ్జం పార్థసారథిరెడ్డి ఆలోచించి నిర్ణయం తీసుకుంటామని చెప్పినట్లు ఆయన తెలిపారు.

గొడవలకు పాల్పడితే చర్యలు

ప్యాపిలి, ఏప్రిల్ 14: ఎన్నికల సమయంలో ఎటువంటి గొడవలకు పాల్ప డిన చర్యలు తప్పవని సీఐ సుధాకర్‌రెడ్డి హెచ్చరించారు. ఆదివారం మండలంలోని జలదుర్గం, మునిమడుగు తదితర గ్రామాల్లో కేంద్ర బలగాలు కవాతు నిర్వహించాయి. అనంతరం ఏర్పాటు చేసిన గ్రామ సభల్లో సీఐ మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడానికి అన్ని రాజకీయ పార్టీలు, ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఐ విజయ్‌కుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అఖిలప్రియకు ఎమ్మార్పీఎస్ మద్దతు

నంద్యాల, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): త్వరలో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో మాజీ మంత్రి అఖిలప్రియ విజయానికి కృషి చేస్తామని ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి కేపీ ఓబులేసు, జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్ద ఓబులేసు చెప్పారు. ఆళ్లగడ్డ పట్టణంలోని ఆమె స్వగృహంలో ఆదివారం అధిక సంఖ్యలో ఎమ్మార్పీఎస్ కార్యకర్తలతో కలిసి ఆమెకు మద్దతు బడుగు బలహీన వర్గాలకు దివంగత నేతలు భూమా నాగిరెడ్డి, శోభానాగిరెడ్డి అభ్యున్నతి కల్గించారని, వారి కుమార్తె అఖిలప్రియను గెలిపించేందుకు కృషి చేస్తామన్నారు.

టీడీపీలో చేరిక

బేతంచెర్ల, ఏప్రిల్ 14: మండలంలోని రెహిమాన్‌పురం గ్రామానికి చెందిన భరత్ కుమార్ రెడ్డి, మధు యాదవ్ ఆధ్వర్యంలో 50 మంది వైసీపీ కార్యకర్తలు డోన్ మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ సమక్షంలో ఆదివారం టీడీపీలో చేరారు. పట్టణ టీడీపీ అధ్యక్షురాలు బుగ్గన ప్రసన్నలక్ష్మి, మాజీ ఎంపీపీ సోమశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

30 లీటర్ల నాటుసారా స్వాధీనం

బేతంచెర్ల, ఏప్రిల్ 14: మండలంలోని సీతారామాపురం గ్రామానికి చెందిన నల్లారెడ్డి అనే వ్యక్తి నుంచి 30 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని అతడిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ శివశంకర్ నాయక్ ఆదివారం తెలిపారు. సీతారామాపురం గ్రామంలో నాటుసారా విక్రయాలు జరుగుతుందన్న సమాచారం మేరకు తన సిబ్బందితో పాటు నాటుసారా స్థావరాలపై దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడుల్లో గ్రామంలో నాటుసారా విక్రయిస్తున్న నల్లారెడ్డిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి 30 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

'టీడీపీ వస్తేనే రాష్ట్రానికి భవిష్యత్తు'

నంద్యాల, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): వచ్చే ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి వచ్చి చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రానికి భవిష్యత్తు ఉంటుందని టీడీపీ నాయకులు సీపీ శ్రీనివాసరెడ్డి(వాసు), బద్రి సుధాకర రెడ్డి అరు. ఆళ్లగడ్డ మున్సిపాలిటీ పరిధిలోని పడకండ్ల గ్రామంలో ఆదివారం వారు ఇంటింటి ప్రచారం చేశారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీతోనే బీసీల అభివృద్ధి: కోట్ల



మాట్లాడుతున్న కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి

డోన్(రూరల్), ఏప్రిల్ 14: తెలుగుదేశం పార్టీతోనే బీసీల అభివృద్ధి సాధ్యమని డోన్ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని చిన్నమ ల్యాపురం గ్రామంలో జరిగిన జయహో బీసీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. డీసీసీ మాజీ చైర్మన్ లక్ష్మీరెడ్డి, టీడీపీ నాయకులు బుగ్గాని రామిరెడ్డి, టి.సుధాకర్ రెడ్డి, తిమ్మయ్య యాదవ్, బీసీ నాయకులు టీఈ కేశన్నగౌడు, శేషఫణిగౌడు పాల్గొన్నారు.

సానుభూతి కోసమే గులకరాయి డ్రామా: సానుభూతి కోసమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి గులకరాయి డ్రామా ఆడుతున్నారని కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి ఎద్దేవా చేశారు. ఆదివారం సాయంత్రం టీడీపీ కార్యాల యంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంపై ప్రజల్లో సానుభూతిని పొందేందుకు మళ్లీ కొత్తగా గులకరాయి డ్రామా ఆడుతున్నాడని ఆరోపించారు.

టీడీపీతోనే రాష్ట్ర భవిష్యత్తు: టీడీపీతోనే రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని డోన్ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని కమలాపురం, కనపకుంట గ్రామాల్లో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ధర్మవరం సుబ్బారెడ్డి, వలసల రామక్రిష్ణ, టీఈ కేశన్నగౌడు పాల్గొన్నారు.

ప్యాపిలి: పట్టణంలో కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి గెలుపు కోసం ఆదివారం కొడుకు కోట్ల రాఘవేంద్రరెడ్డి, కూతురు కోట్ల చిత్రమ్మ ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

ఘనంగా అంబేడ్కర్ జయంతి

నంద్యాల, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ పట్టణంలోని పోస్టల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో ఆదివారం అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. పోస్టల్ ఇన్‌స్పెక్టర్ చంద్రమౌళీశ్వరరెడ్డి, పోస్టుమాస్టర్ రవిచంద్రారెడ్డి, జనార్దనరెడ్డి, జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

● నంద్యాల జిల్లా ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని ఆళ్లగడ్డ పట్టణంలోని కోవెలకుంట్ల రోడ్డులోని ఆయన విగ్రహం వద్ద నివాళి అర్పించారు. అమీర్‌బాషా, రామకృష్ణ తదితరులు ఉన్నారు.

● ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఆళ్లగడ్డ పట్టణంలోని కోవెలకుంట్ల రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి కేపీ ఓబులేసు, జిల్లా కార్యదర్శి పెద్ద ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

దొర్నిపాడు: మండలంలోని ఆయా గ్రామాల్లో ఆదివారం బీఆర్ అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. దొర్నిపాడు గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి అఖిలాబేగం అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

బనగానపల్లె: బనగానపల్లె టీడీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి వేడుకలు నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి బీసీ జనార్దన్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి అంబేడ్కర్ అని అన్నారు.

● బనగానపల్లె పట్టణంలోని ఏపీటీఎఫ్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు మాధవస్వామి ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఏపీటీఎఫ్ నాయకులు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలు వేసి నివాళి అర్పించారు.

రుద్రవరం: రుద్రవరం, చిన్నకంబలూరులో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమాల్లో మాల మహాసేన అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, హుసేన్‌గురప్ప, రామాంజనేయులు, ప్రభాకర్, స్వామిదాసు, ప్రభాకర్, బ్రహ్మం, చంటి, లాజరస్ పాల్గొన్నారు.

చాగలమర్రి: చాగలమర్రి గ్రామంలోని సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలను నిర్వహించారు. ఆయన చిత్రపటానికి టీడీపీ బీసీ సెల్ నంద్యాల జిల్లా అధికార ప్రతినిధి సల్లా నాగరాజు, ఎమ్మార్పీఎస్ మండల మాజీ అధ్యక్షుడు కె.ఓబులేసు పూలమాల వేసి నివాళి అర్పించారు. దూదేకుల నూర్‌బాషా సంఘం అధ్యక్షుడు మహబూబ్‌బాషా, టీడీపీ నాయకులు బషీర్, రంగ నాయకులు, సుధాకర్‌రెడ్డి, అబ్దుల్లా, బాలస్వామి, సమ్మద్, మోహనకృష్ణ, పవన్ పాల్గొన్నారు.

● చాగలమర్రి కేరళ వైద్యశాల వద్ద అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు వేణుగోపాల్, నాయకులు లక్ష్మీనారాయణ, ప్రశాంత్, బాలాజీ, నాగరాజు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

శిరివెళ్ల: శిరివెళ్లలోని నాయిబ్రాహ్మణ కాలనీలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి మంగళి బాల వెంకట రమణ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి వేడుకలను ఆదివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో నవీన్ కుమార్, చిన్న వెంకటేశ్వర్లు, నితీష్ కుమార్, సంజమ్మ, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

కోవెలకుంట్ల: పట్టణంలోని జీవీ కొండారెడ్డి గ్రంథాలయంలో ఆదివారం రాయలసీమ నవ్యాంధ్రప్రదేశ్ మాలమహానాడు అధ్యక్షుడు జయన్న ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి వేడుకలు నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. రంగన్న, రంగమ్మ, జమ్ములమ్మ, ప్రమీల, రత్నమ్మ పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల: మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. అంతకుముందు అంబేడ్కర్ చిత్రపటానికి తహసీల్దార్ సునీతబాయ్ పూలమాలలు వేసి నివాళి అర్పించారు. టీడీపీ కార్యాలయంలో మండల ప్రచార కార్యదర్శి కోటపాడు శివరామిరెడ్డి అధ్యక్షతన అంబేడ్కర్ జయంతిని నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి పోతిరెడ్డి రామ సుబ్బారెడ్డి పూలమాల వేసి నివాళి అర్పించారు. అలాగే కొలిమి గుండ్ల ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో అంబేడ్కర్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఆర్ఐ వెంకటేశ్వర్‌రెడ్డి, వీఆర్‌వోలు ప్రసాదరెడ్డి, భార్గవి, రామసుబ్బయ్య శివరామిరెడ్డి, మండ్ల విజయకుమార్, టైలర్ రాముడు, నాగార్జునరెడ్డి పాల్గొన్నారు.

ప్యాపిలి: పట్టణంలో బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఎస్ఐ జగదీశ్వరరెడ్డి, డాక్టర్ ఎల్లప్ప, బాబా సాహెబ్, బాలరంగన్న, నాగేంద్ర పాల్గొన్నారు.

బేతంచెర్ల: బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అంబేడ్కర్ అని టీడీపీ పట్టణ అధ్యక్షురాలు బుగ్గన ప్రసన్నలక్ష్మి, సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు, నగర పంచాయతీ చైర్మన్ చలంరెడ్డి, వివిధ దళిత సంఘాల నాయకులు పేర్కొన్నారు. ఆదివారం డా.బీఆర్ అంబేడ్కర్ 133వ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీడీపీ నాయకులు మేకల నాగరాజు, రామగోపాల్, నంద్యాల మధు, శ్రీపతి నాగరాజు, సీపీఐ, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

అవుకు: అవుకులో అంబేడ్కర్ చిత్రపటానికి ఎమ్మార్పీఎస్ నాయకులు సాత్రి రామచంద్రుడు పూలమాలలు వేసి నివాళి అర్పిం చారు. మద్దిలేటి, కంబగిరిస్వామి, శశికుమార్, మిద్దె రామకృష్ణ, శివకృష్ణ, రాము, హరికృష్ణ పాల్గొన్నారు.

సంజామల: మండలంలోని గిద్దలూరు గ్రంథాలయం, సంజామలలో అంబేడ్కర్ జయంతి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. గిద్దలూరు గ్రంథాలయాధికారి మద్దిలేటి, వెంకటరాముడు, రామయ్య, కంబగిరి, నాగేశ్వర రావు, పక్కీరయ్య, కృష్ణయ్య, నాగభూషణం పాల్గొన్నారు.

డోన్(రూరల్): పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఆదివారం అంబేడ్కర్ జయంతి సందర్భంగా డోన్ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ టీఈ కేశన్నగౌడు, మండల టీడీపీ అధ్యక్షుడు శ్రీనివాసులు యాదవ్, వలసల రామకృష్ణ, శీలం భాస్కర్ నాయుడు పాల్గొన్నారు.

● అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని పట్టణ పోలీస్‌స్టేషన్ సమీపంలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి డోన్ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి తనయుడు కోట్ల రాఘవేంద్రరెడ్డి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఎమ్మార్పీఎస్ నాయకులు గంధం శ్రీనివాసులు, రాముడు, బీజేపీ నాయకుడు వడ్డె మహారాజ్, టీడీపీ నాయకుడు శేషిరెడ్డి పాల్గొన్నారు.

● ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు ఈశ్వరయ్య మాదిగ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పులికేశవయ్య, చిన్నరాయుడు, సంజు పాల్గొన్నారు.

● డోన్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వేణుగోపాల్‌గౌడు, ఎన్‌టీఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాగుల రాముడు, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వ యకర్త గార్లపాటి మద్దిలేటి, బీజేపీ నాయకులు రవికుమార్‌లు అంబేడ్కర్ విగ్ర హానికి నివాళి అర్పించారు.

● డోన్ బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కృష్ణ ప్రసాద్, జాయింట్ సెక్రటరీ నాగరాజు గౌడు, కోశాధికారి మంగమూరి శ్రీనివాసులు, న్యాయవాదులు పులిదామోదర్, ఈశ్వర్, హుశేన్‌బాషా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

● జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులు ఏఈ నాగరాజు ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. జనసేన ఆధ్వర్యంలో జనసేన నియోజకవర్గ కోఆ ర్డినేటర్ గడ్డం బ్రహ్మం ఆధ్వర్యంలో డోన్‌లో అంబేడ్కర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. పట్టణంలోని పెన్షనర్ల సంఘం కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పెన్షనర్ల సంఘం అధ్యక్షులు కేఎన్ బానుసింగ్, నాయకులు గోపాల్, మౌలాలి నివాళి అర్పించారు.

కొలిమిగుండ్ల రూరల్: కొలిమిగుండ్ల ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో అంబేడ్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. దస్తగిరి , నాగాంజనేయ, మండల వెంకటకృష్ణయ్య, నారాయణలు అంబేడ్కర్ చిత్రపటానికి ఘన నివాళులర్పించారు. అలాగే టీడీపీ కార్యాలయంలో ఆపార్టీ మండల అధ్యక్షుడు మూలెరామేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో కోటపాడు శివరామిరెడ్డి, మంద విజయకుమార్, నాగార్జునరెడ్డి, టైలర్ వెంకటరాముడు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేశారు.



బనగానపల్లెలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పిస్తున్న బీసీ జనార్దనరెడ్డి



ఆళ్లగడ్డలో..



చాగలమర్రిలో..



శిరివెళ్లలో..



ప్యాపిలిలో..



బేతంచెర్లలో..



దొర్నిపాడులో..



కొలిమిగుండ్లలో..



కోవెలకుంట్లలో..




అవుకులో..

వైసీపీకి షాక్

మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి సమక్షంలో 135 కుటుంబాలు టీడీపీలో చేరిక

బనగానపల్లె, ఏప్రిల్ 14: బనగానపల్లె నియోజకవర్గంలో వైసీపీకి షాక్ తగిలింది. ఆదివారం కొలిమిగుండ్ల మండలం ఎర్రగుడి గ్రామానికి చెందిన 80 కుటుంబాలు, సంజామల మండలం ఆర్.లింగందిన్నె గ్రామానికి చెందిన 55 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. బనగానపల్లె టీడీపీ కార్యాల యంలో మాజీ ఎమ్మెలేయ బీసీ జనార్దన్‌రెడ్డి వీరికి టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీ సీనియర్ నాయకుడు ఐవిపక్కీరారెడ్డి, మూలే రామేశ్వరరెడ్డిల ఆధ్వర్యంలో ఎర్రగుడికి చెందిన మాజీ ఎంపీటీసీ వెంకటరెడ్డితో పాటు వైస్ సర్పంచ్ కవిత, నిమ్మకాయల నడిపి దస్తగిరి, చిన్నదస్తగిరి, బాలకృష్ణ, నడిగడ్డ గురుస్వామి, పాతపాటి రంగారెడ్డి, మహేశ్, శ్రావన్‌కుమార్, వెంగళరెడ్డి, సుబ్బరెడ్డి, బాలసుబ్బారెడ్డి, హర్షవర్దన్, బోయనగేశ్ తదితర 80 కుటుంబాలు వైసీపిని వీడి టీడీపీలో చేరారు. అలాగే సంజామల మండలం ఆర్.లింగందిన్నె గ్రామానికి చెందిన మద్దినేని రామనాయుడు, కమ్మ నా గేశ్వర రావు, రామిరెడ్డి సుబ్బనారాయణరెడ్డి, మూరబోయిన లింగన్న, ముల్లబాషా, కమ్మ జయరాముడు, ఆంజనేయులు, పి.ప్రసాద్, కల్వటాల హుసేన్‌బాషా, గిరిబోయిన రామయ్య, మద్దిరాల శ్రీను, ఎర్రన్న, మేకల చెన్న కేశవ, తదితరులు టీడీపీలో చేరారు. ఈసందర్భంగా బీసీ జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ లింగందిన్నె సమస్యలను టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పరిష్కరి స్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు బండిప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.



పంచమపేటలో కరపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే బీసీ

● సంగంహోటల్ యజమాని హైదర్ తన అనుచరులతో టీడీపీలో పెట్రో ల్‌బంకు సెంటర్ వ్యాపారులు, ఆయన అనుచరులు, జంగ్లీమా మసీదు ముత్త వలి వంశీయులు, వారి బంధువులు బీసీ జనార్దన్‌రెడ్డికి మద్దతుగా ఆదివారం టీడీపీలో చేరారు. ఈసందర్భంగా బీసీ జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ టీడీపీలో చేరిన మైనార్టీ నాయకులు సాదరంగా పార్టీలోకి ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. హైదర్‌కు టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ముస్లిం, మైనార్టీల సంక్షేమం టీడీపీతోనే సాధ్యమవుతుందన్నారు.

నాడు కోడి కత్తి.. నేడు గులకరాయి డ్రామా: బీసీ

ఎన్నికలు సమీపిస్తుండడంతో సీఎం జగన్ ముఠా ఓట్ల కోసం డ్రామాలు మొదలు పెట్టిందని, నాడు కోడి కత్తి.. నేడు గులకరాయి డ్రామాకు తెరతీశారని బనగానపల్లె టీడీపీ అభ్యర్థి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. ఆదివారం పంచమపేటలో ప్రజాగళం కార్యక్రమంలో భాగంగా టీడీపీ. జనసే నతో కలసి ఇంటింటికీ తిరిగి సూపర్ సిక్స్ పథకాలను గురించి వివరించారు. ఈసందర్భంగా బీసీ మాట్లాడుతూ గత ఎన్నికల్లో సానుభూతి కోసం గొడ్డలి వేటులో బాబాయ్ వివేకానందరెడ్డిని క్రూరంగా చంపించి గుండెపోటు అంటూ ప్రచారం చేశారన్నారు. నాడు చంద్రబాబుపై నారాసురచరిత్ర అంటూ సాక్షి పత్రికలో అబద్ధపు రాతలు రాశారన్నారు. ఇప్పుడు హంతకుడిగా నిర్ధారించిన అవినాశ్‌రెడ్డిని జగన్ కాపాడుతున్నారని బీసీ ధ్వజమెత్తారు. గత ఎన్నికల మందు సానుభూతి కోసం కోడి కత్తి డ్రామాలు ఆడించి దళిత యువకుడిని జగన్ 5ఏళ్ల జైల్లో పెట్టాడన్నారు. నేడు శవరాజకీయాల కోసం పింఛన్ల పంపిణీ ఆలస్యం చేయించి అవ్వాతాతల శవాలతో నీచరాజకీయాలు జగన్ చేశారంటూ బీసీ మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా సిద్ధం బస్సు యాత్రకు జనం నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో గులకరాయితో దాడి చేయించుకొని మరో డ్రామాకు జగన్ కుట్ర చేస్తున్నారని బీసీ విమర్శించారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, బీసీ అభిమానులు పాల్గొన్నారు.



టీడీపీలో చేరిన వారితో మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి

పెద్దమ్మకు పూజలు

చాగలమర్రి, ఏప్రిల్ 14: చాగలమర్రి గ్రామంలోని పెద్దమకానం వీధిలో వెలసిన పెద్దమ్మకు ఆదివారం పూజలు నిర్వహించారు. మహిళలు బోనాలు సమర్పించారు. అలాగే గంగమ్మ, చాగలమ్మ, చౌడేశ్వరీదేవి ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు.. కార్యక్రమంలో ఆలయాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రుద్రవరం: రుద్రవరంలో పెద్దమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి బోనాలు, చీరలు సమర్పించారు. అమ్మవారి బొడ్డురాయికి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే చిన్నకంబలూరు, కొండమాయపల్లె, ఎల్లావత్తుల గ్రామాలలో కూడా పెద్దమ్మకు పూజలు చేశారు.

లింగమయ్య స్వామికి..

ముత్తలూరు గ్రామ సమీపంలో కొలువుదీరిన లింగమయ్యస్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు అభిషేక చేసి పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామికి నైవేద్యం సమర్పించారు.

17న ట్రాక్టర్ రివర్సు పోటీలు

కొలిమిగుండ్ల రూరల్, ఏప్రిల్ 14: మండలంలోని కనకాద్రిపల్లె గ్రామంలో శ్రీరామనవమి పర్వదినం పురస్కరించుకొని ఈనెల 17న ట్రాక్టర్ ట్రాలీ రివర్సు పోటీలను నిర్వహిస్తున్నట్లు టీడీపీ నియోజకవర్గం సమన్వయకర్త వీఆర్ లక్ష్మిరెడ్డి ఆదివారం తెలిపారు. విజేతలకు నగదు బహుమతులు అందజేస్తున్నట్లు తెలిపారు.

'ప్రశాంతంగా ఓటు హక్కును వినియోగించుకోవాలి'

రుద్రవరం, ఏప్రిల్ 14: ప్రజలు ప్రశాంతంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సీఐ చంద్రబాబు సూచించారు. మండలంలోని డి.కొట్టాల, పెద్దకంబలూరు, చిన్నకంబలూరు, గోనంపల్లె, అప్పనపల్లె గ్రామాల్లో ఆదివారం కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐ నిరంజన్‌రెడ్డి పాల్గొన్నారు.

'సత్ప్రవర్తనతో మెలగాలి'

రుద్రవరం, ఏప్రిల్ 14: రుద్రవరం మండలంలో రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని సీఐ చంద్రబాబు సూచించారు. ఆదివారం రుద్రవరం పోలీసు స్టేషన్‌లో రౌడీషీటర్లకు, మిగిలిన వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎన్నికల్లో ఘర్షణలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. సత్ప్రవర్తనతో ఉండి, తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ నిరంజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జీఈఆర్ సర్వే పరిశీలన

రుద్రవరం, ఏప్రిల్ 14 : మండలంలో జీఈఆర్ సర్వేను ఇన్‌చార్జి ఎంఈవో కోటయ్య ఆదివారం పరిశీలించారు. ఉన్నతాధికారులు జాబితా నిమిత్తం రుద్రవరం గ్రామంలో ఇంటింటికీ తిరిగి విద్యార్థుల వివరాలు సేకరించారు. జీఈఆర్ సర్వే పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

వైసీపీ పతనం మొదలైంది: అఖిలప్రియ

రుద్రవరం, ఏప్రిల్ 14 : రాష్ట్రంలో వైసీపీ పతనం మొదలైందని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ అన్నారు. ఆదివారం కొండమాయపల్లెలో పర్యటించారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా వైసీపీని ఇంటికి పాగనంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. అఖిలప్రియ సమక్షంలో సింగిసాల మహేశ్వర్ రెడ్డి, నంద్యాల రామిరెడ్డి, నేపాల్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, మరో 96 కుటుంబాల టీడీపీలో చేరాయి. భార్గవ రామనాయుడు, గంగుల పృథ్వీరాజ్‌కుమార్‌రెడ్డి, ప్రహ్లాదరెడ్డి, రంగనాయకులు, నారాయణ, బాలరాజు, మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ: టీడీపీ అధికారంలోకి రావడం ఖాయమని భూమా అఖిలప్రియ అన్నారు. ఆదివారం హరివరం గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించగా అల్లూరు గ్రామంలో భూమా జగత్‌విఖ్యాత్‌రెడ్డి ప్రచారం చేశారు. నాయకులు వెంకటేశ్వరరెడ్డి, శేఖర్‌రెడ్డి, నారాయణరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, దస్తగిరిరెడ్డి, హరిప్రసాద్‌రెడ్డి,రాజగోపాల్‌రెడ్డి, బాబుల్‌రెడ్డి, మహేశ్వరరెడ్డి, రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

● ఆర్.జంబులదిన్న గ్రామానికి చెందిన చెన్నంసెట్టి భాస్కర్, హరి, యువరాజు, లక్ష్మీకాంతరెడ్డి, సంజీవ, బాలయ్యలతో పాటు మరో పది మంది అఖిలప్రియ ఆధ్వర్యంలో తెలుగు దేశం పార్టీలో చేరారు.



కొండమాయపల్లెలో టీడీపీలో చేరిన వారితో అఖిలప్రియ

టీడీపీలో జోష్


చంద్రబాబునాయుడు సమక్షంలో టీడీపీలో చేరిన కాటసాని చంద్రశేఖర్‌రెడ్డి (ఫైల్)

నంద్యాల, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి)/బనగానపల్లె

సార్వత్రిక ఎన్నికలకు సరిగ్గా నెల రోజులు సమయం ఉంది. బనగానపల్లె నియోజకవర్గంలో టీడీపీ జెండా ఎగురువేసేందుకు టీడీపీ అభ్యర్థి బీసీ జనార్దన్‌రెడ్డి జోరు పెంచారు. అభివృద్ధి, సంక్షేమం, ఉపాధి, నినాదాలతో ప్రజల్లోకి వెళ్తున్నారు. టీడీపీ సూపర్ సిక్స్ పథకాలపైన అవగాహన కల్పిస్తూ ఇంటింటికీ ప్రచారం నిర్వహిస్తున్నారు. వైసీపీ పాలనలో నియోజకవర్గం కోల్పోయిందేమిటో? మళ్లీ టీడీపీ వస్తే జరిగే మేలేమిటో? తెలియజేస్తూ ప్రజలను చైతన్యం చేస్తున్నారు. ఓటుతో వైసీపీ అరాచక పాలనకు ముగింపు పలకాలని పిలుపునిస్తున్నారు. ఆయన ప్రచారానికి తోడు, నియోజకవర్గంలో అభివృద్ధి లేకపోవడంతో ప్రజలు బీసీ వైపు మొగ్గు చూపుతున్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యేకు ఈ సారి పరాజయం తప్పదన్న సంగతి వైసీపీ నేతలకు కూడా అర్థమైపోయింది. దీంతో వైసీపీ ముఖ్య నేతలు టీడీపీలోకి జంప్ అవుతున్నారు. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి ఝలక్ ఇస్తున్న వారిలో ఆయన ముఖ్య అనుచరులు, సొంత బంధువులు కూడా ఉండటం గమనార్హం. వైసీపీ నుంచి వలసలతో ఊళ్లకు ఊళ్లు ఖాళీ అవుతుండటంతో టీడీపీలో జోష్ నెలకొంది.

- బనగానపల్లెలో వైసీపీని వీడుతున్న ముఖ్య నాయకులు
- ఎమ్మెల్యే కాటసానికి ఝలక్ ఇస్తున్న సొంత బంధువులు
- వైసీపీకి గుడ్‌బై చెప్పిన కాటసాని చంద్రశేఖర్‌రెడ్డి
- టీడీపీ తీర్థం పుచ్చుకున్న చల్లా విజయభాస్కర్‌రెడ్డి
- ఇదే బాటలో మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ పెండేకంటి
- బీసీ జనార్దన్‌రెడ్డి సమక్షంలో టీడీపీలోకి వలసలు
- దిక్కుతోచని స్థితిలో వైసీపీ ● తెలుగు తమ్ముళ్లలో జోష్

● బీసీ చాణక్యంతో వైసీపీ కకావికలం..

బనగానపల్లె నియోజకవర్గం వైసీపీ పాలనలో పూర్తిగా వెనుకబడిపోయింది. గత టీడీపీ హయాంలో అప్పటి ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు పూర్తిగా అవసాన దశకు చేరుకున్నాయి. ఈ సారి ఎన్నికల్లో గెలిచి నియోజకవర్గాన్ని మళ్లీ అభివృద్ధి పథంలో నడపాలన్న ఉద్దేశంతో బీసీ దూసుకుపోతున్నారు. అయితే వైసీపీ అభ్యర్థి, ప్రస్తుత ఎమ్మెల్యేను గెలవాలంటే అభివృద్ధి మంత్రం ఒక్కటే సరిపోదని భావించిన బీసీ తనదైన చాణక్యాన్ని ప్రదర్శిస్తున్నారు. వైసీపీలో ఉన్న అసంతృప్త నేతలు, రామిరెడ్డితో విసిగిపోయిన వారితో పాటు, అభివృద్ధిని కాంక్షించే వైసీపీ నాయకులను తన వైపునకు తిప్పుకునే పనిలో పడ్డారు. బీసీ యోచన ఫలించడంతో వైసీపీ ముఖ్య నాయకులు టీడీపీ కండువాలు కప్పుకున్నారు. ఇలా చేరిన వారిలో ఏకంగా కాటసాని రామిరెడ్డి సొంత బంధువు కాటసాని చంద్రశేఖరరెడ్డి (పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి సొంత సోదరుడు), ఆయన సొంత బావమరిది వంగల పరమేశ్వరరెడ్డి ఉన్నారు. ఇక అవుకు మండలంలో చల్లా రామకృష్ణారెడ్డి సొంత సోదరుడు చల్లా విజయభాస్కరరెడ్డి కూడా బీసీ సమక్షంలో టీడీపీలో చేరాడు. ఇదే మండలానికి చెందిన కాశీపురం టీడీపీ నాయకుడు మోట్ల రామిరెడ్డి, చెన్నంపల్లెకు చెందిన కాట్రెడ్డి మల్లికార్జునరెడ్డి, బెలుం హుసేనయ్య కూడా టీడీపీ కండువాలు కప్పుకోవడంతో అవుకు మండలం దాదాపు పూర్తిగా టీడీపీకి అనుకూలంగా మారింది. సంజామల మండల వైసీపీ నాయకుడు, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ పెండేకంటి కిరణ్‌కుమార్ ఇటీవల చంద్రబాబునాయుడు బనగానపల్లె పర్యటన సందర్భంగా టీడీపీలో చేరారు. ఆయన చేరికతో సంజామల మండలంలో టీడీపీ బలం రెట్టింపైంది. ఇక కొలిమిగుండ్ల, ఆకుమల్ల సర్పంచులు కూడా వైసీపీని వీడి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. నియోజకవర్గంలో ముఖ్య నాయకులతో పాటు బనగానపల్లె నియోజకవర్గ వ్యాప్తంగా రోజూ వందల సంఖ్యలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఆ పార్టీని వీడి బీసీ సమక్షంలో టీడీపీ కండువాలు కప్పుకుంటున్నారు. ఈ స్థాయిలో ఇక్కడ వైసీపీ ఖాళీ అవుతుండడంతో ఆ పార్టీ నాయకులకు ఏం చేయాలో పాలుపోవడం లేదు.


చంద్రబాబునాయుడు సమక్షంలో టీడీపీలో చేరిన చల్లా విజయభాస్కర్‌రెడ్డి, మోట్ల రామిరెడ్డి



ముస్లింల సమావేశంలో మాట్లాడుతున్న బీసీ జనార్దన్‌రెడ్డి

అభివృద్ధి పేరిట ఓట్లడిగే పరిస్థితి లేకపోవడంతో, ఆ పార్టీ నాయకులు మొసలి కన్నీరు కార్చుతూ ప్రజలను మరోసారి మభ్యపెట్టేందుకు సిద్ధమయ్యారు. ఇక సీఎం జగన్ అయితే కిందటి నెలల నియోజకవర్గం కేంద్రంలో జరిగిన సభలో మాట్లాడుతూ రామిరెడ్డి పేదవాడని, మళ్లీ గెలిపిస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తాడని బీద అరుపులు అరవడం గమనార్హం. అయితే.. ఇక్కడ టీడీపీలోకి ప్రతిరోజూ జరిగే చేరికలు చూస్తుంటే, ఎన్నికలకు ముందే బీసీ విజయం ఖాయమైందని, ఎవరెన్ని మోస పూరిత మాటలు చెప్పినా, ఈ సారి వైసీపీకి ఓటు వేసేది లేదని ఇక్కడి ఓటర్లు కృతనిశ్చయంతో ఉన్నారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

● జాతరలా చేరికలు..


బీసీ జనార్దన్‌రెడ్డి సమక్షంలో చేరిన యనకండ్ల ఎస్సీ కాలనీ వాసులు

ఎన్నికల సందర్భంలో కప్పదాట్లు సహజం. పార్టీ మీద అసంతృప్తితో ఉన్నవారు, ప్రాధాన్యం దక్కనివారు, ఏదో ప్రయోజనం ఉందని భావించేవారు పార్టీ మారుతూ ఉంటారు. ఇలా చేరే సమయంలో నాయకుడితో పాటు ఓ 30 నుంచి 50 మంది కార్యకర్తలు ఉండటం సహజం. కానీ బీసీ సమక్షంలో టీడీపీలో చేరే వారి సంఖ్యను చూస్తుంటే ఏదో జాతర జరిగిన తీరును తలపిస్తుంటుంది. కొన్ని గ్రామాల్లో అయితే అక్కడి జనాభా మొత్తం టీడీపీ కండువాలు కప్పుకుంటుండటం గమనార్హం. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఇదే తీరు. కొలిమిగుండ్ల, బెలుం శింగవరం, కనకాద్రిపల్లె, చింతలాయపల్లె, పెట్నికోట, యర్రగుడి, తిమ్మనాయునిపేట, అంకిరెడ్డిపల్లె, గొర్విమానుపల్లె, తదితర గ్రామాల్లో నాగిశెట్టిపల్లె, పెద్దవెంతుర్ల, కమ్మవారిపల్లె తదితర గ్రామాల్లో వైసీపీని వీడి వందల సంఖ్యలో టీడీపీలో చేరారు. సంజామల మండలంలో ఆకుమళ్ల, పేరుసోముల, గిద్దలూరు, ఆర్.లింగందిన్నె, తదితర గ్రామాల్లో భారీ సంఖ్యలో వైసీపీని వీడి టీడీపీలో చేరారు. కోవెలకుంట్ల మండలంలో కోవెలకుంట్ల, గుల్లదుర్తి, కంపమల్ల, పెద్దకొప్పెర్ల, లింగాల, సౌదరదిన్నె, బిజనవేముల, రేవనూరు తదితర గ్రామాల్లోని వైసీపీ కార్యకర్తలు, నాయకులు ఆ పార్టీని వీడి బీసీ సమక్షంలో టీడీపీలో చేరడం గమనార్హం. బనగానపల్లె మండలంలో బనగానపల్లె, చిన్నరాజుపాలెం, తాండా, పాతపాడు, జోలాపురం, ఇల్లూరుకొత్తపేట, పలుకూరు, బీరవోలు, రామతీర్థం, చెర్వుపల్లె తదితర గ్రామాలకు చెందిన వైసీపీ నాయకులు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. చేరికలు జరిగిన ప్రతిసారి వందలాది కుటుంబాలు గంపగుత్తగా టీడీపీ కండువాలు కప్పుకోవడం నియోజకవర్గంలో టీడీపీ బలాన్ని తెలియజేస్తోంది. ఇవేగాకుండా నియోజకవర్గంలో మిగిలిన చాలా గ్రామాల నుంచి వందల సంఖ్యలో టీడీపీలో చేరేందుకు క్యూ కడుతున్నారు. ఈ చేరికలను ఆపేందుకు వైసీపీ నేతలు తీవ్రంగా శ్రమిస్తున్నా కుదరడం లేదు. ఎమ్మెల్యే సొంత మనిషులే పార్టీని వీడుతుంటే, ఇక మిగిలిన వారికి ఏం చెప్పి నిలువరించాలో అర్థంగాక ద్వితీయ శ్రేణి వైసీపీ నేతలు తలలు పట్టుకుంటున్నారు.



చంద్రబాబునాయుడు సమక్షంలో చేరిన కిరణ్‌కుమార్

నియోజకవర్గంలో కలియదిరుగుతున్న బీసీ దంపతులు..

నియోజకవర్గంలో టీడీపీ అందించబోయే పథకాలను బీసీ జనార్దన్‌రెడ్డి ఓ వైపు ప్రచారం చేస్తుంటే, ఆయన సతీమణి ఇందిరమ్మ మరోవైపు ప్రజలతో మమేకమవుతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడగానే అమలు చేసే సంక్షేమ పథకాలపై ప్రజలకు పూర్తిస్థాయిలో బీసీ జనార్దన్‌రెడ్డి, ఆయన సతీమణి బీసీ ఇందిరమ్మ అవగాహన కల్పిస్తున్నారు. సూపర్ సిక్స్ పథకాలతో ఎలాంటి మేలు జరుగనుందో వివరిస్తూ ప్రజలను చైతన్యం చేస్తున్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే నిరుద్యోగులకు నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి, పాఠశాలలకు వెళ్లే ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.15వేలు, 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1500, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ప్రతి కుటుంబానికి ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లు, ప్రతి రైతుకు సంవత్సరానికి రూ.20వేలు ఆర్థిక సాయం అందించనుందని తెలియజేస్తున్నారు. వాస్తవానికి బనగానపల్లె నియోజకవర్గంలోని ప్రతి ఇల్లు బీసీ దంపతులకు సుపరిచితమే! వీరు ఏ గ్రామానికి వెళ్లినా వీరిని ప్రజలు తమ సొంత ఇంటి మనుషుల్లా స్వాగతం పలుకుతుండటం గమనార్హం. ఈ ఐదేళ్లు అధికారంలో లేకపోయినా వీరు ప్రజల్లోనే ఉన్నారు. ఎప్పటికపుడు ప్రజా సమస్యలు తెలుసుకుంటూ వారికి భరోసానిస్తున్నారు. బీసీ గెలిస్తే తమకు మరింత మేలు చేస్తారన్న భావనకు ప్రజలు వచ్చారు. నియోజకవర్గంలో ఏ ఇద్దరినీ కదిలించినా రానున్న ఎన్నికల్లో బీసీదే గెలుపు అన్న ధీమాను కనబరుస్తున్నారు.

సేవా తత్పరత

- అంధులకు పెన్షన్లు
- పేదింటి బిడ్డలకు పెళ్లి కానుకలు
- ప్రతిభ కలిగిన విద్యార్థులకు ప్రోత్సాహకాలు
- ఆస్పత్రి రోగులకు అన్నదానం
- కవులు, కళాకారులకు ప్రోత్సాహం
- సొంత డబ్బులతో సేవలందిస్తున్న బీసీ రాజారెడ్డి



నంద్యాల, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి)/బనగానపల్లె

సాటి మనిషి కష్టాల్లో ఉన్నా పట్టించుకోకుండా తమ పని తాము చూసుకునే పరిస్థితుల్లో ప్రస్తుత సమాజం ఉంది. కానీ ఆయన అలా అనుకోలేదు. చేయూతనిచ్చే వారు లేక ఇబ్బందులు పడుతున్న వారికి తన వంతు సాయం చేసేందుకు నడుంబిగించాడు. 'ప్రార్థించే పెదవులకన్నా.. సాయం చేసే చేతులు మిన్న' అనే సూక్తిని స్ఫూర్తిగా తీసుకుని సొంత నిధులతో సేవా కార్యక్రమాలు మొదలుపెట్టారు. ప్రతిఫలం ఆశించకుండా, రాజకీయ దురుద్దేశాలు లేకుండా.. అనాథలకు పింఛన్లు, పేదింటి ఆడపిల్ల కుటుంబానికి పెళ్లి కానుకలు, ప్రతిభ కలిగిన విద్యార్థులకు ప్రోత్సాహకాలు, వైద్యం చేయించుకునేందుకు ఆస్పత్రికి వచ్చే వారు ఆకలికి అలమటించకుండా అన్నదానాలు చేస్తున్నారు. ఆయన సేవలు ప్రత్యేక సందర్భాల్లోనో, ఒకటి, రెండు సంవత్సరాలకో పరిమితం కాలేదు. దాదాపు మూడు దశాబ్దాలుగా కొనసాగుతూనే ఉన్నాయి. చేతికి ఎముక లేకుండా దానధర్మాలు చేస్తున్న ఆ వ్యక్తి ఎవరో కాదు.. బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి.


అంధులకు పింఛన్ పంపిణీ చేస్తున్న మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి

● కరువును చూసి చలించి..

బీసీ రాజారెడ్డి కుటుంబం ఆర్థికంగా బాగా ఉన్నత కుటుంబం. రాజారెడ్డి స్థానిక మెయిన్ రోడ్డులో 1990ల్లోనే రాజా అండ్ కో పేరిట మండీ మర్చంట్ నిర్వహించేవారు. 1992లో బనగానపల్లెకు తీవ్ర కరువు వచ్చింది. 60-70 ఏళ్లలో ఎప్పుడూ రాని కరువు ఆ ఏడు చవిచూడటంతో పట్టణంలోని బావులన్నీ ఎండిపోయిన పరిస్థితి. అప్పట్లో ఈ స్థాయిలో బోర్లు కూడా లేవు. స్థానిక ప్రజలు గుక్కెడు నీటి కోసం అలమటించే పరిస్థితి. తమ దుకాణం ఎదురుగా ఉండే బావిలోని చుక్క నీటి కోసం వందల మంది పోటెత్తడం చూసి రాజారెడ్డి చలించిపోయారు. ప్రజలు పడుతున్న ఇబ్బందులను గమనించిన ఆయన.. తమ పొలంలోని బోరు నీటిని ప్రజలకు అందిస్తే బాగుంటుందన్న ఆలోచన చేశారు. అనుకున్నదే తడువుగా.. తన ఎనిమిదెకరాల వరి చేనును బీడుబెట్టి, ఆ పంటకు అందించే నీటిని ప్రజల దాహార్తిని తీర్చేందుకు మళ్లించారు. ఆ తర్వాత దీనిని 24 గంటలు మంచి నీటిని అందించేలా తీర్చిదిద్ది ప్రజల ఇబ్బందులను తొలగించారు. అలా మొదలైన నీటి సరఫరా ఇప్పటికీ కొనసాగుతుండటం విశేషం. ఏ రాజకీయ నాయకుడు పట్టించుకోని తమ అవస్థలను రాజారెడ్డి పరిష్కరించడంతో బనగానపల్లె ప్రజలు ఆయన మంచితనాన్ని గుర్తించి అభినందించసాగారు. తాను చేసిన ఒక్క పని ఇంతమందికి ఉపయోగపడితే.. తన సేవలను ఇంకా విస్తరిస్తే మరింత మందికి మేలు చేకూరుతుందన్న భావన రాజారెడ్డిలో మెదిలింది. దీంతో తన సేవలను విస్తృతం చేయడం ప్రారంభించారు.


ప్రభుత్వ పాఠశాల పదో తరగతి విద్యార్థులకు ప్రతిభా ప్రోత్సాహకాలు అందిస్తున్న మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి

ప్రభుత్వాలు తమ రాజకీయ లబ్ధి కోసం పింఛన్లను అందిస్తుంటాయి. అయితే రాజారెడ్డి మాత్రం తన సొంత నిధులతో, ముఖ్యంగా అంధులకు పింఛన్లను అందించడం గమనార్హం. ప్రతి నెలా 160 మంది అంధులకు ఒక్కొక్కరికి రూ.500 చొప్పున పింఛన్లు అందిస్తూ తన సేవా గుణాన్ని చాటుకుంటున్నారు. ఇలా పింఛన్లు అందుకుంటున్న వారిలో కడపకు చెందిన వారు కూడా ఉండటం గమనార్హం.

● అనాథలు, విద్యార్థులకు..

అలాగే అనాథలకు, అనాథాశ్రమాలకు తన సేవలందిస్తున్నాడు. ఇక ఆయన సేవలు పక్క రాష్ట్రమైన తెలంగాణకు కూడా పాకాయి. అక్కడి నల్గొండ జిల్లా చౌటుప్పల్ పట్టణానికి చెందిన అమ్మానాన్న అనాథ ఆశ్రమానికి దాదాపు 50 క్వింటాళ్ల బియ్యాన్ని విరాళంగా అందించారు. రెండేళ్లలో రూ.6 లక్షల విలువ చేసే ఆహార ధాన్యాలను ఆశ్రమానికి అందించడం గమనార్హం. ఇక ఆయన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం నియోజకవర్గంలోని దాదాపు 55 ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందిస్తున్నారు. ప్రతి ఉన్నత పాఠశాలలో పదో తరగతి ఫలితాల్లో ప్రథమ ర్యాంకు సాధించిన విద్యార్థులకు రూ.5వేల నగదు, మండల స్థాయిలో ప్రథమ శ్రేణి వచ్చిన విద్యార్థులకు రూ.15 వేల నగదును అందిస్తున్నారు. ఇక పేదలకు వైద్య సేవలు అందించే ఉద్దేశంతో ఇప్పటి వరకు 6 ఉచిత మెడికల్ క్యాంపులు నిర్వహించారు.

● తల్లిదండ్రుల పేరు మీద..

బనగానపల్లె ప్రజలకు నీటి దాహాన్ని తీర్చడంతో వచ్చిన సంతృప్తితో రాజారెడ్డి 1992 నుంచే తల్లిదండ్రులు బీసీ గుర్రెడ్డి, లక్ష్మమ్మ పేరు మీద సేవా కార్యక్రమాలు చేయడం మొదలుపెట్టారు. 1994 నుంచి తన తండ్రి జ్ఞాపకార్థం ప్రతి సంవత్సరం ఆయా ప్రభుత్వ పాఠశాలలోని దాదాపు 200 మంది నుంచి 250 మంది విద్యార్థులకు ఉచితంగా దుస్తులు పంపిణీ చేస్తున్నారు. 2006 నుంచి 2015 వరకు నిరుపేదలకు వారి మతానుసారంగా సంవత్సరానికి 60 మందికి తాళి బొట్లు, చాంద్‌తారా, శిలువ తాళి పంపిణీ చేశారు. ఆయన చేస్తున్న మంచి పనిని కొంతమంది దుర్వినియోగం చేయడం మొదలుపెట్టారు. అయినా ఆయన వెరవక పేదింటి ఆడపిల్లల పెళ్లికి వరుడు, వధువుకు కానుకలు అందిస్తున్నారు. 2004 నుంచి వివాహాది శుభకార్యాలకు జరిగే ఇళ్లకు రెండు ట్రాక్టర్లతో ఉచితంగా నీటిని అందించడం మొదలుపెట్టారు. 2015 సంవత్సరంలో తన తండ్రి బీసీ గుర్రెడ్డి జ్ఞాపకార్థం రూ.11 లక్షలతో ఉచిత కూలింగ్ మినరల్ వాటర్ ప్లాంట్‌ను స్థానికంగా నెలకొల్పారు. 2016లో తన తండ్రి జ్ఞాపకార్థం బేతంచెర్ల మండలం రంగాపురం గ్రామ సమీపంలో వెలసిన ఘనమద్దిలేటి స్వామి దేవస్థానంలో రూ.14 లక్షలు వెచ్చించి 22 వేల లీటర్ల కెపాసిటీతో మినరల్ వాటర్ ప్లాంట్, కూలింగ్ వాటర్ మిషన్ ఏర్పాటు చేసి భక్తుల దాహార్తిని తీరుస్తున్నారు. బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలలో రూ.3లక్షల వ్యయంతో 1500 లీటర్ల కెపాసిటీతో మినరల్ వాటర్ ప్లాంట్ 2015 వరకు నిర్వహించారు. 2005 నుంచి తన తండ్రి జ్ఞాపకార్థం బనగానపల్లె 50 పడకల ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు, వారి వెంట వచ్చిన సహాయకులకు రాత్రి పూట నాణ్యమైన భోజనాన్ని అందించేవారు. వీటిని ఓర్వలేని వైసీపీ నాయకులు ఉచిత అన్నదానాన్ని అడ్డుకోవడంతో ఈ సేవా కార్యక్రమం ప్రస్తుతం ఆగిపోయింది. రాజారెడ్డి మొదటి నుంచి ఏ రాజకీయ లబ్ధిని ఆశించకుండా సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. అయితే సేవకు కూడా రాజకీయ ముసుగు తొడిగి రాజారెడ్డిని ఇబ్బంది పెట్టడం సరైనది కాదని పలువురు విమర్శిస్తున్నారు.


పేదలకు పెళ్లి కానుకలు పంపిణీ చేస్తున్న రాజారెడ్డి



గోర్లగుట్ట వద్ద ఉచిత మినరల్ వాటర్ కేంద్రం ఏర్పాటు చేసి ప్రజల దాహార్తిని తీరుస్తున్న బీసీ రాజారెడ్డి

● ఆస్తులు కరుగుతున్నా..

పేదలకు చేస్తున్న సేవా కార్యక్రమాలకు సంబంధించి రాజారెడ్డి ఏ ఒక్కరి నుంచి సాయం తీసుకోకుండా పూర్తిగా తన సొంత నిధులనే వెచ్చిస్తున్నారు. ఆయన 1992లో సేవా కార్యక్రమాలు మొదలుపెట్టిన సమయంలో సంవత్సరానికి రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షలు ఖర్చయ్యేది. ఆ తర్వాత కార్యక్రమాల పరిధి పెరగడంతో ప్రస్తుతం సంవత్సరానికి రూ.40 లక్షలను రాజారెడ్డి వెచ్చిస్తున్నట్లు అంచనా! ఇలా ఖర్చు చేసే క్రమంలో తన ఆస్తి మొత్తం కరిగిపోతున్నా ఆయన ఏమాత్రం వెరవడం లేదు. ఇప్పటికే తండ్రి ద్వారా వారసత్వంగా వచ్చిన దాదాపు 15 ఇళ్లను, రెండు ప్లాట్లను అమ్ముకోవాల్సి వచ్చింది. వీటి ధర ప్రస్తుత విలువ ప్రకా రం దాదాపు రూ.6 కోట్లకు పైగానే ఉంటుందని అంచనా! ఈ స్థాయిలో సేవా కార్యక్రమాలు చేస్తున్న రాజారెడ్డి పెళ్లి కూడా చేసుకోకుండా తన జీవితాన్ని పూర్తిగా ప్రజలకే అంకితం చేశారు.


గోరటి వెంకన్నను సత్కరిస్తున్న బీసీ రాజారెడ్డి (ఫైల్)

● అరుణభారతీ సాహితీ సంస్థ అధ్యక్షుడిగా..



నేటి ఆధునిక యుగంలో టీవీలు, ఇంటర్నెట్, స్మార్ట్ ఫోన్ల రాకతో కళలను, కళాకారులను ప్రజలు మరిచిపోతున్నారు. అయితే కొన్ని సంస్థలు కళలను, కళాకారులను ఆదరిస్తూ కళల గొప్పదనాన్ని సమాజానికి, ప్రజలకు తెలియజేస్తున్నాయి. అలాంటి సంస్థల్లో అరుణభారతి సాహితీ సాంస్కృతిక సంస్థ కూడా ఒకటి. ఈ సంస్థ బనగానపల్లెలోనే పురుడు పోసుకోవడం విశేషం. అప్పటి బనగానపల్లె మెజిస్ట్రేట్ నరసింహం, అడ్వకేట్ ఏరాశి రామ్మోహన్ రెడ్డి 1976లో ఈ సంస్థను ఏర్పాటు చేశారు. ఈ సంస్థకు 2000 సంవత్సరంలో అధ్యక్ష బాధ్యతలను బీసీ రాజారెడ్డి స్వీకరించారు. అప్పటి నుంచి అనేక మంది కళాకారులను, కవులను సత్కరించి ఆదరించారు. సంస్థ తరఫున సత్కారం పొందిన వారిలో సహస్ర అవధాని గరికపాటి నరసింహారావు, ప్రముఖ సినీ గేయ రచయిత గోరటి వెంకన్న, సినీ కళాకారుడు అలెగ్జాండర్, ప్రముఖ కవి జొన్నవిత్తుల రామలింగేశ్వర రావు, సినీ నటుడు శివారెడ్డి, అన్నమయ్య సంకీర్తనల గాయని అనురాధ, జానపద సాహిత్యవేత్త అమళ్లదిన్నె గోపినాథ్ రావు, స్త్రీవాద సాహితీ వేత్త డాక్టర్ శ్రీదేవి, రవివర్మ జాతీయ అవార్డు గ్రహీత కోటేష్, కళంకారీ అవార్డు గ్రహీత శివప్రసాద్, సుప్రసిద్ధ గణిత అవధాని నాగళ్ల ఏలియా ఉన్నారు. అరుణ భారతీ సాహితీ సంస్థ చేస్తున్న కృషిని గుర్తించిన సినీ దర్శకుడు దాసరి నారాయణ రావు అప్పట్లో బీసీ రాజారెడ్డిని సత్కరించి, అభినందించారు. ఇలా బీసీ రాజారెడ్డి అటు సేవా కార్యక్రమాల్లోనూ, ఇటు సాహితీ సేవలోనూ తన వంతు సాయమందిస్తూ ముందుకు సాగుతున్నారు.